LGTV

# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,208 | పేజీలు -12 | బుధవారం -27 - మే - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094




కర్ణాటక సరిహద్దులో..

## 2 బ్రిడ్జి కమ్ బరాజ్‌లు!

- కృష్ణాపై కొల్హార్, కొర్తుకుండ వద్ద 1.08 టీఎంసీలతో ఒకటి
- భీమాపై తంగడగి వద్ద 1 టీఎంసీతో మరొకటి
- ప్రతిపాదనలపై రెండు రాష్ట్రాల మధ్య సంప్రదింపులు ప్రారంభం
- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో సచివాలయంలో చర్చలు

2లో

2034 నాటికి కోటి మంది మహిళలను

# కోటీశ్వరులను చేస్తాం

### తెలంగాణ ఆడబిడ్డలతోనే మా ప్రభుత్వం ఏర్పడింది

- రాష్ట్ర మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలనేది ప్రభుత్వ సంకల్పం
- మారుమూల గ్రామాల్లోని మహిళలు కూడా ఆర్థికంగా నిలబడాలి
- మహిళల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, సూపర్ బజార్లు
- మహిళా సంఘాలు వడ్లు కొనుగోలు చేసి బియ్యం ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు



హైదరాబాద్: 'రాష్ట్ర వ్యాప్తంగా రూ.800 కోట్లతో 8 వేల మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశాం. ఈ మేరకు ప్రభుత్వం దేశంలోనే ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ విధంగా మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళా సంఘాలకు మరిన్ని ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. మిగతా 2 లో

## ప్రధాని మోదీకి సీఎం విజయ్ లేఖ..?

కావేరీ నదిపై కొత్త వివాదం

కర్ణాటక డ్యామ్ ప్రతిపాదనకు తమిళనాడు వ్యతిరేకత

మేకేదాటు ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్

త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్న సీఎం విజయ్

దిగువ రాష్ట్రాల అనుమతి తప్పనిసరని వ్యాఖ్య

తమిళనాడు: కావేరీ నది నీటి పంపకాల వివాదం మళ్లీ రాజుకుంది. కర్ణాటక కొత్త డ్యామ్ పనులకు సిద్ధమవడంతో తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుతూ ప్రధానమంత్రికి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అత్యవసర లేఖ రాశారు. మేకెదాటు దగ్గర కర్ణాటక ప్రభుత్వం డ్యామ్ మిగతా 2 లో





## వికసిత భారత్ లక్ష్యానికి ఈ 12 ఏళ్ల పాలనే పునాది

- మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు.. 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక
- కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంకు 12 ఏళ్లు పూర్తి
- దేశవ్యాప్తంగా '22 విజయాలు' ప్రచారం చేసేందుకు బీజేపీ ప్రణాళిక
- ఇది సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానంగా అభివర్ణించిన కమలదళం మిగతా 2 లో

## ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాయం కోరుతూ వినతిపత్రం



2లో

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇదే తొలి సమావేశం

కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అమిత్ షాతోనూ భేటీకి ప్రణాళిక

కేంద్రంతో సత్సంబంధాల దిశగా యూడీఎఫ్ సర్కార్ తొలి అడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా

## ఎస్టీలను మోసం చేస్తోంది

### చిన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దే

హైదరాబాద్: చిన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లంబాడీల ఆత్మగౌరవం నిలబెట్టింది కేసీఆర్ అని తెలిపారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా జరిపామన్నారు. బంజారాహిల్స్‌లో బంజారాలకు ఆత్మగౌరవ భవనం కట్టించామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "టీఎస్ ప్రైడ్ ద్వారా 13,200 మందికి ఉద్యోగాలిచ్చాం. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినుల కోసం డిగ్రీ కళాశాలలు కట్టించాం. సేవాలాల్, కుమురం భీం, ఏకలవ్య కార్పొరేషన్లకు ఇప్పటి ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. ఎస్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా మోసం చేస్తోంది" అని విమర్శించారు.



## గోదావరి, కృష్ణమ్మ వెలవెల అని పాడుకోవాల్సిన దుస్థితి వచ్చింది

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన!


- మా తెలుగు తల్లి గేయంలో లిరిక్స్ మార్చాల్సిన దుస్థితి వచ్చింది
- గోదావరి నది కాలుష్య పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన పవన్
- పరిశ్రమల వ్యర్థాలతో నదులు మురికి కూపాలుగా మారుతున్నాయి



అమరావతి: రాజమండ్రిలో గోదావరి నది కాలుష్య పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. నదుల ప్రస్తుత దుస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "మన సంస్కృతిలో భాగమైన 'మా తెలుగు తల్లి' గేయంలో.. గోదావరి, కృష్ణమ్మల 'మిగతా 2 లో

## అంతరిక్షంలోకి కృత్రిమ మానవ పిండాలను పంపిన చైనా

అంతరిక్షంలోకి మానవ పిండాలు.. చైనా సంచలన ప్రయోగం!



2లో

తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్‌లో ఈ ప్రయోగానికి శ్రీకారం

సూక్ష్మ గురుత్వాకర్షణలో పిండాల అభివృద్ధిపై శాస్త్రవేత్తల అధ్యయనం

ఇవి ల్యాబ్‌లో సృష్టించిన నమూనాలని, నిజమైన పిండాలు కాదని స్పష్టత

## ఏమిటీ 'అబ్రహాం అకార్డ్స్'.. ఇరకాటంలో పాకిస్థాన్!

అబ్రహాం ఒప్పందాల్లో చేరాలన్న ట్రంప్ పిలుపును తిరస్కరించిన పాకిస్థాన్

ఇజ్రాయెల్‌తో సంబంధాలు తమ సిద్ధాంతాలకు విరుద్ధమని స్పష్టీకరణ



2లో

పాలస్తీనా ఏర్పాటే తమ విధానమని మరోసారి తేల్చిచెప్పిన పాక్

నమ్మలేని వాళ్లతో ఎలా మాట్లాడతామని ప్రశ్నించిన రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



భక్తులతో పోటెత్తుతున్న తిరుమల..

## కిలోమీటర్ల మేర క్యూలైన్లు

- శ్రీవారి హుండీకి రూ.4.92 కోట్ల ఆదాయం
- వేసవి సెలవులు ముగుస్తుండటంతో తిరుమలలో భారీ రద్దీ
- శిలాతోరణం వరకు సర్వదర్శనం క్యూలైన్లు
- శ్రీవారిని దర్శించుకున్న 89,399 మంది భక్తులు
- శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 18 నుండి 24 గంటల సుదీర్ఘ సమయం పడుతుంది

తిరుపతి: వేసవి సెలవులు ముగుస్తుండటంతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. మిగతా 2 లో

మే 27, 28 తేదీల్లో... టీడీపీ సరికొత్త

# మహానాడుకు సర్వం సిద్ధం

### ఈసారి భౌతికంగా కాకుండా హైబ్రిడ్ పద్ధతిలో డిజిటల్ వేదికగా ఏర్పాటు

- మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి 1,848 క్లస్టర్లకు అనుసంధానం
- 'స్త్రీశక్తి' ప్రధాన ఇతివృత్తంగా జరగనున్న ఈ ఏడాది మహానాడు
- ప్రధాని మోదీ పిలుపు మేరకు ఖర్చులు తగ్గించి, నిధులు పార్టీకి వినియోగం




అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' కార్యక్రమం ఈసారి సరికొత్త రూపంలో జరగనుంది. దేశ రాజకీయాల్లోనే ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతూ, మే 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కేంద్ర కార్యాలయం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్లకు మిగతా 2 లో



2లో

మా కుమార్తె కేసులో

## న్యాయం చేయండి..

జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు!

- 2017లో హత్యాచారానికి గురైన సుగాలి ప్రీతి
- తమకు న్యాయం జరగలేదన్న ప్రీతి తల్లిదండ్రులు
- కేసును పక్కన పెట్టేశారని ఆవేదన
- అండగా ఉంటామని భరోసా ఇచ్చిన జగన్

# మే 27, 28 తేదీల్లో... టీడీపీ సరికొత్త మహానాడుకు సర్వం సిద్ధం

మొదటి పేజి తరువాయి

డిజిటల్ సాంకేతికత ద్వారా అనుసంధానించి, లక్షలాది మంది కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నారు. 'స్త్రీశక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధాని పిలుపుతో ప్రణాళికలో మార్పు

వాస్తవానికి ఈ ఏడాది మహానాడును నెల్లూరులో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని టీడీపీ మొదట ప్రణాళిక రచించింది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ పౌరులు ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. దేశ యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని, భారీ ఖర్చుతో కూడిన భౌతిక కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పు ద్వారా ఆదా అయిన నిధులను పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ నిర్ణయం దేశం కోసం టీడీపీ వేస్తున్న డిజిటల్ అడుగులకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

లోకేష్ మార్క్.. డిజిటల్ విప్లవం

ఈ హైబ్రిడ్ మహానాడు ఆలోచన వెనుక పార్టీ యువ నాయకుడు, హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నారా లోకేష్ దార్శనికత ఉందని పల్లా తెలిపారు. ఆయన అనుభవం, సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగుదేశం పార్టీని డిజిటల్ యుగంలోకి నడిపిస్తున్నారని కొనియాడారు. సుమారు రెండు వేల క్లస్టర్ల ద్వారా లక్షలాది మంది కార్యకర్తలను ఏకకాలంలో అనుసంధానించడం ఒక ప్రాంతీయ పార్టీకి రికార్డు అని, ఇది దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నిర్వహించనున్న ఈ హైబ్రిడ్ మహానాడుపై ఇతర రాజకీయ పార్టీల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు.

హైబ్రిడ్ మహానాడు ఇలా..

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్ సహా ముఖ్య నేతలు పరిమిత సంఖ్యలో భౌతికంగా పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్ల వద్ద భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతి క్లస్టర్ నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలు, నేతలు నేరుగా చంద్రబాబు, లోకేష్‌లతో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దీనివల్ల ప్రతి కార్యకర్త నేరుగా మహానాడులో పాల్గొన్న అనుభూతి పొందుతాడని పార్టీ భావిస్తోంది. గతంలో వేలాది మంది మాత్రమే పాల్గొనే అవకాశం ఉండగా, ఈసారి లక్షలాది మందికి మహానాడు చేరువ కానుంది.

### స్త్రీశక్తి, ఇతర అంశాలపై చర్చ

ఈ ఏడాది మహానాడులో 'స్త్రీశక్తి' ప్రధాన అంశంగా ఉండనుంది. మహిళా సంక్షేమం కోసం టీడీపీ గతంలో చేసిన కృషి, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నారు. దీంతో పాటు 'కాక్రోచ్ జనతాపార్టీ' వంటి రాజకీయ అంశాలు, ఆరోగ్యకరమైన సోషల్ మీడియా వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై కూడా చర్చలు, తీర్మానాలు ఉంటాయని పల్లా శ్రీనివాస రావు తెలిపారు.

### సర్వం సిద్ధం.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి క్లస్టర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, గత 10 రోజులుగా తాను కేంద్ర కార్యాలయం నుంచే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నానని పల్లా వివరించారు. కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, తెలుగు జాతి గర్వించే ఈ పసుపు పండుగను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

మొదటి పేజి తరువాయి

స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) మహిళలను పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడంలో భాగంగా మహిళల ఆధ్వర్యంలో రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం అవసరమైన భూమి, బ్యాంకు రుణాలు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుంది. మహిళా సంఘాలు మండలాల్లో గోడౌన్లు, లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవాలి. వీటి కోసం వంద ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైస్ మిల్లులు, గోడౌన్ల కోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ ఏర్పాటు చేసి కావాల్సిన రుణాలను మంజూరు చేస్తాం. అలాగే మహిళా సంఘాలతో మహిళా శక్తి సూపర్ బజార్లు కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేస్తాం. ఈ బజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంటుంది. వీటిల్లో నాణ్యమైన వస్తువులు దొరికేలా చూడాలి. పట్టణ ప్రాంతాల్లో వీటి కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకు లీజుకు ఇస్తాం. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బజార్లుగా తయారు కావాలి. డీమార్ట్, బిగ్ బజార్‌ల కంటే బెస్ట్‌గా మహిళా శక్తి సూపర్ బజార్లు ఉండాలి..' అని సీఎం అన్నారు.

తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే తమ ప్రభుత్వం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మళ్లీ ఈ సర్కార్‌ను అధికారంలోకి తీసుకువచ్చే శక్తి మహిళలకు ఉందని అన్నారు. రాష్ట్ర మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని, మారుమూల గ్రామాల్లోని మహిళలు కూడా ఆర్థికంగా నిలబడాలన్నదే తమ ప్రయత్నమని చెప్పారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని అన్నారు. 'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది.. కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడు రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుంది. ఈ దిశలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోంది..' అని అన్నారు. సోమవారం సచివాలయంలో..ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా..8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి సీఎం స్విచ్ నొక్కి వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

5వ తేదీన మహిళలకు మరో 553 బస్సులు

'మహిళలను బస్సుల యజమానులను చేయాలని వెయ్యి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చాం. అదే విధంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా సంఘాల ద్వారా నడిచే మరో 553 బస్సులను ప్రారంభిస్తున్నాం.

మిల్లుల గోడౌన్లలో ధాన్యం నిల్వ చేయం

భవిష్యత్తులో మిల్లుల గోడౌన్లలో ధాన్యం నిల్వలు పెట్టం. మహిళా ఎస్‌హెచ్‌జీలు వద్ద కొనుగోలు చేసి బియ్యం ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారిగా ఉంటారు.

ఇకపై రూ.10 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ రుణాలు

సోలార్ ఎనర్జీ అనగానే అదానీ, అంబానీ గుర్తుకు వస్తారు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తోంది. రిలయన్స్ వాళ్లు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాన్ని కూడా మహిళా స్వయం సహాయ సంఘాలతో చేయిస్తున్నాం. మహిళలకు సంబంధించి రూ. 5 లక్షల వరకున్న బ్యాంక్ లింకేజీ లోన్లను రూ.10 లక్షలకు పెంచుతున్నాం. మహిళలు తాము తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లించి ముందుకు వెళ్తున్నారు. లోన్లు తీసుకున్న వ్యాపారులు మాత్రం ఎగ్గొట్టి పారిపోతున్నారు..' అని ముఖ్యమంత్రి అన్నారు.

## ఏమిటీ 'అబ్రహాం అకార్డ్స్'.. ఇరకాటంలో పాకిస్థాన్!

ఢిల్లీ: ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే అబ్రహాం ఒప్పందాల్లో (అబ్రహాం అకార్డ్స్) చేరాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన పిలుపును పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యం కాదని, అది తమ దేశ మౌలిక సిద్ధాంతాలకు విరుద్ధమని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చిచెప్పారు. ఒక స్థానిక టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1967కి ముందున్న సరిహద్దులతో, తూర్పు జెరూసలేం రాజధానిగా పాలస్తీనా దేశం ఏర్పడే వరకు ఇజ్రాయెల్‌ను గుర్తించే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు. "ఒక్క రోజు కూడా మాట మీద నిలబడలేని వ్యక్తులతో మీరు ఎలా కూర్చుంటారు?" అని ఆయన ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు. ఇరాన్‌తో చర్చల్లో భాగమైన సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు అబ్రహాం ఒప్పందాల్లో చేరాలని ఇటీవల ట్రంప్ పిలుపునిచ్చారు. ఇప్పటికే యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలు ఈ ఒప్పందాల్లో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రతిపాదనకు పాక్ నుంచి గట్టి వ్యతిరేకత వ్యక్తమైంది. ట్రంప్ ప్రతిపాదన పాకిస్థాన్‌ను ఇరకాటంలో పడేసింది. ఏళ్లుగా దెబ్బతిన్న అమెరికాతో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని ఇస్లామాబాద్ భావిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ విషయంలో తమ వైఖరిని మార్చుకోవడం అసాధ్యమని స్పష్టం చేస్తోంది. పాకిస్థాన్ దేశంలో పాలస్తీనాకు బలమైన ప్రజా మద్దతు ఉండటమే దీనికి కారణం. 78 ఏళ్ల పాక్ చరిత్రలో ఇజ్రాయెల్‌ను ఎన్నడూ గుర్తించలేదు. ఆ దేశ పాస్‌పోర్టులపై కూడా 'ఈ పాస్‌పోర్ట్ ఇజ్రాయెల్ మినహా అన్ని దేశాలకు చెల్లుతుంది' అని స్పష్టంగా ఉంటుంది. ప్రస్తుతానికి, అమెరికా ఒత్తిడి కంటే తమ సంప్రదాయ వైఖరికే పాకిస్థాన్ కట్టుబడి ఉందని ఆసిఫ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## మా కుమార్తె కేసులో న్యాయం చేయండి..
### జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు!

అమరావతి/కర్నూలు: గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఏళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్ కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు. బాధిత తల్లిదండ్రుల గోడును సావధానంగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ తరఫున లీగల్ సపోర్ట్ ఇస్తామని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా కల్పించారు.

## అంతరిక్షంలోకి కృత్రిమ మానవ పిండాలను పంపిన చైనా

చైనా: మానవ భవిష్యత్తు, అంతరిక్ష పరిశోధనల చరిత్రలో చైనా ఒక కీలక ముందడుగు వేసింది. తొలిసారిగా మానవ కృత్రిమ పిండాలను అంతరిక్షంలోకి పంపి, వాటి అభివృద్ధిపై ఒక సంచలన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. మే 10న లాంగ్ మార్చ్ 7 రాకెట్ ద్వారా ప్రయోగించిన తియాన్‌జౌ-10 మిషన్, ఈ కృత్రిమ పిండాలను తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్‌కు విజయవంతంగా చేర్చింది. అంతరిక్ష కేంద్రంలో సూక్ష్మ గురుత్వాకర్షణ (మైక్రోగ్రావిటీ) వాతావరణంలో ఈ పిండాల నమూనాలు సుమారు 5 రోజుల పాటు అభివృద్ధి చెందాయి. అనంతరం, తదుపరి విశ్లేషణ కోసం వాటిని ప్రత్యేక పద్ధతిలో భద్రపరిచారు. ఇదే సమయంలో భూమిపై కూడా కొన్ని నమూనాలను పెంచి, అంతరిక్షంలోని వాటితో పోల్చి చూడనున్నారు. ఈ ప్రయోగంలో భాగంగా జెబ్రాఫిష్, ఎలుకల పిండాలను కూడా పంపారు. అయితే, ఇవి నిజమైన మానవ పిండాలు కావని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిశోధకులు స్పష్టం చేశారు. మానవ మూల కణాల నుంచి ప్రయోగశాలలో సృష్టించిన ఈ నమూనాలు, పిండం అభివృద్ధిలోని తొలి దశలను (సుమారు 14-21 రోజులు) మాత్రమే పోలి ఉంటాయని, ఇవి శిశువుగా మారే అవకాశం లేదని తెలిపారు. అంతరిక్షంలో ఉండే తీవ్రమైన రేడియేషన్, గురుత్వాకర్షణ లేకపోవడం వంటి పరిస్థితులు మానవ పునరుత్పత్తిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవడమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం. భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపై మానవ కాలనీలు ఏర్పాటు చేయాలన్నా, సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణాలు చేపట్టాలన్నా ఈ తరహా పరిశోధనలు అత్యంత కీలకం కానున్నాయి. ఈ ప్రయోగ ఫలితాలు, అంతరిక్షంలో మానవ మనుగడకు సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

ఢిల్లీ: కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్.. ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్.. చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

## కర్ణాటక సరిహద్దులో.. 2 బ్రిడ్జి కమ్ బరాజ్‌లు!

హైదరాబాద్: తెలంగాణ--కర్ణాటక సరిహద్దులో రెండు బ్రిడ్జి కమ్ బరాజ్‌లను సంయుక్తంగా నిర్మించాలనే ప్రతిపాదనలపై ఉభయ రాష్ట్రాల మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. కొల్హార్, కొర్తుకుండ వద్ద కృష్ణా నదిపై 1.08 టీఎంసీల సామర్థ్యంతో ఒక బ్రిడ్జి కమ్ బరాజ్.. తంగడగి గ్రామం వద్ద భీమా నదిపై 1 టీఎంసీ సామర్థ్యంతో మరో బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలపై రాష్ట్ర సచివాలయంలో రెండు రాష్ట్రాల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. జూరాల ప్రాజెక్టుకు సుమారు 30 కి.మీ.ల ఎగువన కొల్హార్, కొర్తుకుండ వద్ద ఒక బరాజ్, కృష్ణా ప్రధాన పాయలో భీమా నది కలిసే ప్రాంతానికి ఎగువన తంగడగి వద్ద మరో బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలపై కర్ణాటక అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ బరాజ్‌ల నిర్మాణంతో రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని కర్ణాటక మంత్రి చెప్పారు. బరాజ్‌ల కుడి వైపు నుంచి కర్ణాటక, ఎడమ వైపు నుంచి తెలంగాణ.. నీళ్లను మళ్లించుకోవచ్చని, వేసవిలో తాగునీటి అవసరాల కోసం పంపింగ్ చేసుకోవచ్చని సూచించారు. అయితే ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజా ప్రతినిధుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో సమగ్ర అధ్యయనం కోసం నీటిపారుదల శాఖ కార్యదర్శి, ఈఎన్‌సీ (జనరల్), ఇతర నిపుణులతో ఒక కమిటీ వేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకుంటామని, ఈ మేరకు ఒప్పందం చేసుకుంటామని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రతిపాదనలను కర్ణాటక మంత్రికి వివరించామని ఉత్తమ్ మీడియాకు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ప్రతిపాదనలను ఆ రాష్ట్రం ముందు ఉంచినట్టు వెల్లడించారు. ఈ చర్చల్లో సాధించిన పురోగతిని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కృష్ణా, భీమా నదులపై బరాజ్‌లు నిర్మిస్తే దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు వరదలు లేనప్పుడు వచ్చే రీజనరేటెడ్ నీళ్ల ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రధానంగా భీమా నదిపై ఇప్పటికే కర్ణాటక ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు నిర్మించడంతో జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గిపోయిందని ఆయన అన్నారు. కృష్ణా, భీమా నదులపై ఎగువన కర్ణాటకలో ఇప్పటికే కట్టిన ప్రాజెక్టులతో వర్షాభావ సంవత్సరాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కరువు పీడిత మక్తల్ నియోజకవర్గానికి తాగు, సాగునీటి సరఫరా కోసం ఈ రెండు బరాజ్‌లను నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. కర్ణాటకలోని ఆల్మట్టి బరాజ్ ఎత్తు పెంచడానికి ఆ రాష్ట్రం తీసుకుంటున్న చర్యలతో తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు పలువురు కర్ణాటక మంత్రిని నిలదీసినట్టు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి కీలకమైన ఆర్డీఎస్ ఆధునికీకరణ ప్రాజెక్టుకు కర్ణాటక సహకరించడం లేదని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేయగా, ఈ విషయంలో ఏపీ సహకరించడం లేదని కర్ణాటక మంత్రి బదులిచ్చారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులు విడుదల చేస్తే సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాయచూర్ ఎంపీ జి.కుమార్‌నాయక్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్నగౌడ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మేఘారెడ్డి, శివకుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తుతున్న తిరుమల..
# కిలోమీటర్ల మేర క్యూలైన్లు

తిరుపతి: వేసవి సెలవులు ముగుస్తుండటంతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తుతున్నారు. ఈ ఉదయం 7 గంటల సమయానికే ఉచిత సర్వదర్శనం కోసం వచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, క్యూలైన్లు శిలాతోరణం వరకు కిలోమీటర్ల మేర విస్తరించాయి. ఉదయం 8 గంటల తర్వాత క్యూలైన్లలోకి ప్రవేశించిన భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 18 నుండి 24 గంటల సుదీర్ఘ సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. అలాగే రూ.300 శీఘ్రదర్శనానికి 3 నుండి 5 గంటలు, సర్వదర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు 4 నుండి 6 గంటల సమయం పడుతోందని పేర్కొన్నారు. మరోవైపు, నిన్న ఒక్కరోజే మొత్తం 89,399 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 49,985 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.4.92 కోట్ల ఆదాయం సమకూరింది. నిన్న రికార్డు స్థాయిలో భక్తులకు 4.88 లక్షల లడ్డూలను విక్రయించారు. అలాగే తిరుమలలోని టీటీడీ అంబులెన్స్, ఆసుపత్రి కేంద్రాలలో నిన్న 3,751 మంది భక్తులు వైద్య చికిత్సలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# వికసిత భారత్ లక్ష్యానికి ఈ 12 ఏళ్ల పాలనే పునాది

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. "ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారిందన్నారు. దశాబ్దాలుగా తెరమరుగైన కోట్లాది మంది ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్' అని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళ్లు సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న 'విధానాల పక్షవాతం' నుంచి బయటపడి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం'గా అభివర్ణించారు. జన్ ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.

## ప్రధాని మోదీకి సీఎం విజయ్ లేఖ..?

మేకెదాటు దగ్గర కర్ణాటక ప్రభుత్వం డ్యామ్ నిర్మించాలని చూస్తోంది. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని సీఎం విజయ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కర్ణాటక అక్కడ భూమి పూజకు ఏర్పాట్లు చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. కావేరీ నీటి వివాద ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక ఉల్లంఘిస్తోందని విజయ్ ఆరోపించారు. ఈ ఆదేశాలను గతంలో సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు దిగువ రాష్ట్రాల అనుమతి లేకుండా కొత్తగా ఎలాంటి జలాశయాలు నిర్మించొద్దని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అంగీకారం కర్ణాటకకు తప్పనిసరని వివరించారు. ట్రైబ్యునల్ అనుమతించిన ప్రాజెక్టుల జాబితాలో మేకెదాటు లేదని సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరీ బేసిన్‌లో ఇప్పటికే నీటి కొరత ఉందని లేఖలో రాశారు. ఉన్న నీటిని ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు కేటాయించారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా భారీ జలాశయం నిర్మించడం సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందని హెచ్చరించారు. కాగా, త్వరలోనే విజయ్ ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసే అవకాశం ఉంది.

# గోదావరి, కృష్ణమ్మ వెలవెల అని పాడుకోవాల్సిన దుస్థితి వచ్చింది

మొదటి పేజి తరువాయి

'మా తెలుగు తల్లి' గేయంలో.. గోదావరి, కృష్ణమ్మల 'గలగల'లు అని ఎంతో గర్వంగా పాడుకుంటాం. కానీ, నేడు పరిశ్రమల వ్యర్థాలతో నదులు మురికికూపాలుగా మారుతున్న తీరు చూస్తుంటే.. భవిష్యత్తులో గోదావరి, కృష్ణమ్మ 'వెలవెల' అని పాడుకోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అటు రాజకీయ, ఇటు సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వ్యర్థాలు నేరుగా పవిత్ర గోదావరి నదిలో కలవడం పట్ల పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నదిలోని కలుషిత నీటి నమూనాలను (శాంపిల్స్) తక్షణమే సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆ నివేదికలు చేతికి వచ్చిన వెంటనే పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించిన ఫ్యాక్టరీలపై కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నదులను కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. దశాబ్దాలుగా నగరానికి శాపంగా మారిన ఈ కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని పవన్ తెలిపారు. ఇందులో భాగంగానే గోదావరి కాలుష్య నివారణ కోసం ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం అధికారికంగా ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ నదిలోకి వ్యర్థాల విడుదలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, కాలుష్య నియంత్రణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా పారిశ్రామికవేత్తలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## కర్ణాటక పీఠంపై ఉత్కంఠ..
## డీకే శివకుమార్ వైపు ప్రియాంక మొగ్గు?

కర్ణాటక : కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు మళ్లీ జోరందుకున్నాయి. ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య స్థానంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలని అధిష్ఠానం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఢిల్లీలో కీలక నేతల మధ్య సుదీర్ఘ చర్చలు నడుస్తున్నట్లు తెలుస్తోంది.

### ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతల హడావుడి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు ఢిల్లీ చేరుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ వీరితో విడివిడిగా సమావేశమైనట్లు సమాచారం. 2028 ఎన్నికల లోపు ఇద్దరు నేతల మధ్య విభేదాలు పార్టీని దెబ్బతీయకుండా చూడాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు టాక్. డీకే శివకుమార్‌కు సీఎం పదవి ఇవ్వాలని ప్రియాంకా గాంధీ గట్టిగా పట్టుబడుతున్నట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాబోయే 72 గంటల్లో దీనిపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. ఊహాగానాలు సహజమేనని సిద్ధరామయ్య కొట్టిపారేయగా మంచి రోజులు వస్తాయని డీకే శివకుమార్ వ్యాఖ్యానించడం గమనార్హం.

### మార్పునకు కారణాలు

సిద్ధరామయ్య వయస్సు 2028 నాటికి 80 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రభుత్వ పాలనపై అసంతృప్తి, వ్యతిరేకత పెరుగుతోందని సర్వేలు చెబుతున్నట్లు టాక్ నడుస్తోంది. సిద్ధరామయ్యకు అహిందా (వెనుకబడిన, దళిత, మైనారిటీ) వర్గాల మద్దతు బలంగా ఉంది. అందుకే ఆయన్ను నొప్పించకుండా రాజ్యసభ సీటు ఇచ్చి కుమారుడికి మంత్రి పదవి ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### డీకే శివకుమార్‌కు ఉన్న బలాలు

డీకే శివకుమార్‌కు వొక్కలిగ సామాజికవర్గంలో మంచి పట్టు ఉంది. ఆయన్ను సీఎం చేస్తే జేడీఎస్, బీజేపీ ఓటు బ్యాంకును దెబ్బతీయొచ్చని కాంగ్రెస్ అంచనా వేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన కేపీసీసీ అధ్యక్షుడిగా, డిప్యూటీ సీఎంగా రెండు కీలక పదవుల్లో ఉన్నారు. అయితే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలు ప్రతిపక్షాలకు ఆయుధంగా మారే ప్రమాదం కూడా ఉందనే చర్చ నడుస్తోంది.

## పుణ్యం మాట దేవుడెరుగు..
## రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి: పవన్ కల్యాణ్

రాజమండ్రి: రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో కాలుష్య పరిస్థితిపై తనిఖీలు చేపట్టారు. వెంకటనగరం సమీపంలోని ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతాన్ని ఆయన బోటులో వెళ్లి స్వయంగా పరిశీలించారు. అక్కడ అధికారులతో నీటి నమూనాలను (శాంపిల్స్) సేకరింపజేశారు. ఈ సందర్భంగా పవన్ తో పాటు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. "పవిత్ర గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం దారుణం. పుష్కరాల వేళ ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు... రోగాలు మాత్రం కచ్చితంగా వస్తాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏలూరులో తాగునీటి కాలుష్యం కారణంగా జరిగిన ప్రమాదాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంత అవసరమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ కాలుష్య సమస్యపై త్వరలోనే అసెంబ్లీ, కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. పుష్కరాల రేవులను కేవలం అందంగా తీర్చిదిద్దడమే కాదు, నది కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి పవన్ అన్నారు. పేపర్ మిల్స్ కాలుష్యంపై తాము నిఘా ఉంచామని, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు.

## రూ.వెయ్యి కోట్ల స్కామ్.. ప్రభుత్వ భూములు
## ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు: హరీశ్‌రావు

హైదరాబాద్: రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 170 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదని ఆర్డీవో పేర్కొన్న నాలుగు రోజుల వ్యవధిలో అక్కడి తహసీల్దార్ పట్టా భూమిగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రూ.వెయ్యి కోట్ల స్కామ్ జరిగితే.. తహసీల్దార్‌ను బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, నేతలు ఎల్.రమణ, ముఠా గోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు.

### అంత ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది?

"పెద్దషాపూర్‌లో 170 ఎకరాలు ప్రభుత్వ భూమి అని ఆర్డీవో స్పష్టంగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దానికి భిన్నంగా పట్టా భూమిగా పేర్కొంటూ రాత్రికి రాత్రే భూభారతిలో ప్రైవేటు భూమిగా చేర్చారు. ఆర్డీవో ఆదేశాలను ధిక్కరించి ఆర్డర్ ఇచ్చే ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది? ప్రైవేటు వ్యక్తులకు భూములను ధారాదత్తం చేస్తే ఆయన్ను కాపాడుతోంది ఎవరు? తహసీల్దార్‌పై గతంలో ఏసీబీ దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఉన్నారు.

భూభారతిలో ఎంట్రీ జరగాలంటే కలెక్టర్, సీసీఎల్ఏ అనుమతి ఉండాలి. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు ఎవరున్నారు? ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా శంషాబాద్‌లో రూ.కోట్ల విలువైన 170 ఎకరాల భూమిని కట్టబెట్టే చేసే ధైర్యం తహసీల్దార్‌కు ఉంటుందా? ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరిపించాలి. తహసీల్దార్‌ను డిస్మిస్ చేయాలి. ఆ భూములను వెంటనే భూభారతిలో నిషేధిత జాబితాలో చేర్చాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ప్రజా రంజక పాలనలో రేవంత్ సర్కార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫిజుద్దీన్



మెదక్ ప్రతినిధి (లోకల్ గైడ్ )మే 26 రేవంతన్న పాలనలో రా ష్ట్రంలో వేగంగా ఆలయాల అభివృద్ధి అనే నినాదంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం, కేవలం నిధుల కేటాయింపుతోనే ఆగకుండా పనుల నాణ్యతను, కాలపరిమితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మూసాబ్ తెలిపారు. ఇటు సంక్షేమం, అటు ఆధ్యాత్మిక రంగాల సమతుల్యతతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయాల పట్ల మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల రూపురేఖలను మార్చేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చారిత్రాత్మక ఆలయాల పునరాభివృద్ధి, భక్తులకు ప్రపంచస్థాయి వసతుల కల్పనే ధ్యేయంగా భారీగా నిధులను మంజూరు చేస్తూ 'ఆధ్యాత్మిక వాసి'గా సీఎం రేవంత్ రెడ్డి తన మార్కును చాటుకుంటున్నారు.తాజాగా రాష్ట్రంలోని ప్రధాన పుణ్యక్షేత్రాలకు రికార్డు స్థాయిలో నిధులు కేటాయిస్తూ మాస్టర్ ప్లాన్‌లను ఆమోదించారు. ఈ సందర్భంగా మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మూసాబ్ ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు ఆలయాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే, రేవంతన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రూ. 1,730 కోట్లకు పైగా నిధులు కేటాయించి హిందూ ధర్మ పరిరక్షణకు, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేసిందని ఆయన కొనియాడారు.

## ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి మే 26 (లోకల్ గైడ్):జిల్లాలో ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో 10 బృందాలు, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.

నల్లగొండ డి.ఎస్.పి.కె శివరాం రెడ్డి ఆధ్వర్యంలో 7మంది సీఐలు, 10 మంది ఎస్ఐలు,

నార్కోటిక్ దాల్ తో కలిసి సుమారు 2500 మంది పోలీసు అధికారులు సిబ్బంది.

పట్టణంలో సుమారు 360 ఇండ్లలో తనిఖీలు, 46 మంది అనుమానితులను గుర్తింపు.

నేర నియంత్రణ లక్ష్యంగా నల్లగొండ పట్టణంలో తెల్లవారుజామున10 బృందాలతో విస్తృత కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 26 .(లోకల్ గైడ్)నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణాన్ని అష్ట దిగ్బంధం చేసి నిరంతరం రద్దీ గల ప్రాంతాలు సతీష్ నగర్ తో పాటు ఇతర పలు ప్రాంతాల్లో 10 బృందలుగా ఏర్పాటు చేసి మంగళవారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానితుల గుర్తింపు, అక్రమ కార్యకలాపాల అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ ఆపరేషన్ నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏడు మంది సీఐలు,18 మంది ఎస్.ఐలతో నార్కోటిక్ డాగ్ తో కలిపి సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, పట్టణంలోని పలు కాలనీలు, అనుమానిత ప్రాంతాలు, లాడ్జీలు, అద్దె గదులు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.పట్టణంలో సుమారు 360 ఇండ్లలో తనిఖీలు నిర్వహించగా, 46 మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను గుర్తించారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 మంది, బీహార్‌కు చెందిన 4 మంది, తమిళనాడు కు చెందిన 1 వ్యక్తి, అస్సాం కు చెందిన 1 వ్యక్తి, హర్యానాకు చెందిన 2 మంది ఉన్నారు.తనిఖీలలో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లు,5 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే ఆరుగురికి గంజా టెస్ట్ లు నిర్వహించగా వీరిలో ఇద్దరిని గంజా సేవించినట్లు గుర్తించడం జరిగింది.అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు (త్రిచక్ర వాహనాలు) వీటిలో అదిక శబ్దం కలిగిన 02 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేస్తున్నారు. అదనంగా 4 సెల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బైక్‌లను నెట్టుకుంటూ నిరసన.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 26 .(లోకల్ గైడ్).పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండలోని సుభాష్ విగ్రహం నుండి క్లాక్ టవర్ వరకు బైక్‌లను నెట్టుకుంటూ వెళ్లి వినూత్నంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఒకవైపు ప్రజల ఆదాయం తగ్గిపోతుండగా, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజల ఆదాయాన్ని పెంచాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా, ప్రజలపై మరింత భారాలు మోపుతూ "మునిగే నక్కపై తాటి పండు పడ్డట్లు" పరిస్థితిని సృష్టిస్తోందని విమర్శించారు.క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని చెబుతూ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నారని, కానీ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు మాత్రం రూపాయి కూడా తగ్గించడం లేదని ఆరోపించారు. దేశం, ధర్మం పేరుతో మాట్లాడుతున్న పాలకులు దేశ ప్రజలను ధరల మోతతో బ్రతకనివ్వడం లేదన్నారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే దశలవారీగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజావ్యతిరేక చర్య అని పేర్కొన్నారు.వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కార్లపూడి రాము, మాదాసు రావణ్, ఎండీ అదిల్, శివ, సాయి, రోహిత్, మధు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# దైవ అనుగ్రహం లేనిది ఏది జరగదు. దైవ దర్శనం తోనే సానుకూల దృక్పథం అలవడుతుంది.

ప్రతి ఒక్కరు గుడి విషయంలో నిస్వార్థంగా పారదర్శకంగా ప్రవర్తించాలి.

కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . మే 26 .(లోకల్ గైడ్) దైవ దర్శనం తోనే ప్రతి మనిషిలో సానుకూల దృక్పథం అలవాటు అవుతుందని అన్నారు . మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని పురాతన శివరామ క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. దైవ అనుగ్రహం లేనిది ఏది జరగదని గుడి ముందు అందరూ సమానులేనని గుడి వ్యవహారంలో రాజకీయాలు చేయొద్దని స్థానికులకు తెలిపారు. సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే ప్రతిదీ సానుకూలంగానే ఉంటుందని... నెగటివ్ ఆలోచన చేస్తే ప్రతిదీ ఇబ్బందిగానే ఉంటుందని హితవు పలికారు. గుడిలో దాని పరిసరాలలో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక భావన విరాజిల్లుతు ఉంటుందని ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత స్వార్థం వల్ల గుడి వాతావరణాన్ని కలుషితం చేయొద్దన్నారు. గుడి విషయంలో ప్రతి ఒక్కరు నిస్వార్థంగా పారదర్శకంగా భక్తి భావంతో మెలగాలి అని సూచించారు.

## ఇనాం భూములను కూడా వదలని నాయకులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి మే 26 (లోకల్ గైడ్):ఇనాం భూమి మీద కలెక్టర్ గారికి ఫిర్యాదు చేసిన దీ=ా సీనియర్ లీడర్ అక్రమ్ అలీ..!నిర్మల్ లోని బైల్ బజార్ ూణ చీఎ7 భారత్ పెట్రోల్ పంప్ పక్కన ఉన్న ఇనాం భూమిని ఒక వైస్ చైర్మన్ 5 కోట్ల రూపాయలకు ఒక ప్రముఖ డాక్టర్ కు అమ్మినట్టు సమాచారం..!ఇనాం భూమి అంటే పూజరులకు ఇచ్చే భూమి.. ఈ భూమి అమ్మడం కొనడం జరుగదు..!సర్వే నెం. 2308/ నిర్మల్ శివారులోని ఇనాం భూమి అక్రమ బదిలీ మరియు అనుమతి లేకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేశారు..!ఈ విషయం మీద స్థానిక కలెక్టర్ గారికి ఫిర్యాదు చేసిన నేత అక్రమ్ అలీ..!ఈ భూమిని ఒక మహిళ వద్ద నుండి బెదిరించి భూమినీ ఆ నాయకుడి పేరిట మార్చుకున్నట్లు సమాచారం..!ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరిన దీ=ా నేత...!

## యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన



లోకల్ గైడ్' ఖమ్మం2 ( జింకలగూడెం ప్రీమియం లీగ్ ) క్రికెట్ టోర్నమెంట్ ఈరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించబడుతుంది ముఖ్య అతిథులు తుంబూరు దయాకర్ రెడ్డి గారు మండల కూచిపూడి జగదీష్ గ్రేటర్ ఇన్ఫ్రా చైర్మన్ సయ్యద్ ఇమాం బెల్లం శ్రీనివాస్ రామసహాయం నరేష్ రెడ్డి చావా శివ రామకృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల అశోక్ గారు గోల్ తండా గ్రామ సర్పంచ్ భానోత్ సుజాత అనిల్ కుమార్ గారు అతిరథమహారధులకు స్వాగతం సుస్వాగతం

## అకాల వర్షాల హెచ్చరిక.. ధాన్యం లిఫ్టింగ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి: కలెక్టర్ కె హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 26:మంగళవారం చిన్నకోడూరు మండలంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం మరియు జిల్లా కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలో అకాల వడగండ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లిఫ్టింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. అయితే వాతావరణ శాఖ అకాల, వడగండ్ల వానలపై హెచ్చరికలు జారీ చేసినందున కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.ప్రస్తుతం ఏఎంసీల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి స్థానిక గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చిన్నకోడూరు ఏఎంసీ వద్ద రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే గన్నీ సంచుల్లో నింపి లిఫ్టింగ్‌కు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. చిన్నకోడూరు గ్రామంలో అధిక మొత్తంలో ధాన్యం నిల్వ ఉండటంతో గోదాములలో దిగుమతికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎత్తైన ప్రాంతాల్లో నిల్వ ఉంచి టార్పాలిన్ కప్పాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం కొట్టుకుపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతాంగానికి సూచించారు.వరి, మక్కల కొనుగోళ్లు ఒకేసారి జరుగుతున్న కారణంగా హమాలీలు, లారీల కొరత ఏర్పడిందని, దశలవారీ ప్రణాళిక ప్రకారం కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్‌ఫ్లవర్ కొనుగోలుకూ అనుమతి ఇచ్చిందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.రైతులు సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వరద విపత్తులు ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి...

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



లోకల్ గైడ్' ఖమ్మం:ప్రాణ, ఆస్తి నష్ట నివారణే ప్రధాన లక్ష్యం... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలిలోతట్టు ప్రాంతాలు, ముంపు రహదారులు, బలహీన చెరువు కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలిముంపు గ్రామాలు, కట్ ఆఫ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలివిద్యుత్ ప్రమాదాలు, పాత భవనాల కూల్చివేతలు, చెట్ల విరుగుడు ఘటనలపై అప్రమత్తంగా ఉండాలి వరదల అనంతరం వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలివరద విపత్తుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ఖమ్మం, రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారు లతో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూలి గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధతే ప్రాణ నష్టాన్ని తగ్గించే మార్గమని పేర్కొన్నారు.వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులని, సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. వరదల సమయంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ముఖ్య బాధ్యత అని అన్నారు. మానవ ప్రాణాలు, పశువుల ప్రాణనష్టం జరగకుండా చూడడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు కీలకంగా పనిచేయాలని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో వెంటనే సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారుల కాంటాక్ట్ బుక్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వరదల సమయంలో అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముంపుకు గురయ్యే గ్రామాలు, ప్రభుత్వ సంస్థలు, సంబంధాలు తెగిపోయే గ్రామాల జాబితా, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలు ముందు గానే సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ని కుటుంబాలను తరలించాల్సి వస్తుందో, ఎన్ని పునరావాస కేంద్రాలు అవసరమవు తాయో, అందులో అవసరమైన సౌకర్యాలు ఏమిటో అన్న వివరాలతో ముందస్తు నివేదికలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.సంబంధాలు తెగిపోయే గ్రామాల్లో అవసరమైన నిత్యావసర వస్తువులు ముందుగానే తగినంత నిల్వ ఉంచాలని సూచించారు. కమ్యూనికేషన్ కోసం ప్రత్యేక వ్యక్తిని నియమించాలని ఆదేశించారు.

అన్ని పెట్రోల్ బంకులను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. వరదల సమయంలో అత్యవసర ఖర్చుల కోసం సంబంధిత శాఖలకు జిల్లా యంత్రాంగం ముందస్తు నిధులు అందజేస్తుందని,వాటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.ప్రతి మండలంలో ఎంపీడీవో, ఎంఈఓ, ఎంపీఓ, తహసీల్దార్, పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు సభ్యులుగా మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా మండలాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.పాత ఇళ్లు కూలిపోవడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తున్నందున కూలిపోయే ప్రమాదంలో ఉన్న భవనాలను ముందుగానే గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, క్రాస్ రోడ్లు, లోతట్టు రహదారుల వద్ద ప్రజలు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి వరదల సమయంలో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. ప్రజలు దాటరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి మండలంలో భారీ చెట్లను గుర్తించి కొమ్మలు తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రం అందుబాటులో ఉండాలని తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో అవసరమైన డిమార్కేషన్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వర్షాకాలంలో పెచ్చులు ఊడిపోయే ప్రమాదంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ప్రమాదకర గదులను వినియోగించరాదని సూచించారు. ముంపుకు గురయ్యే పాఠశాలల విషయంలో స్థానిక పరిస్థితులను బట్టి సెలవులు మంజూరు చేయాలని తెలిపారు.లోతట్టు, దూర ప్రాంత గ్రామాలు, కట్ ఆఫ్ గ్రామాలను ముందుగానే గుర్తించి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యే వారికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వరదల అనంతరం వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అన్ని రహదారులపై గుంతలను పూడ్చాలని, తాగునీటి పైప్‌లైన్‌లకు నష్టం వాటిల్లితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.గత అనుభవాల ఆధారంగా ముంపు గ్రామాలు, ప్రమాద ప్రాంతాలను గుర్తించి సమీపంలోనే పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తాళ్లు, టార్చ్‌లైట్లు, బోట్లు వంటి అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని,ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఒక కేంద్రంలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి మండలంలో మంచి ఈత తెలిసిన వ్యక్తుల జాబితా సిద్ధంగా ఉంచాలని సూచించారు. విపత్తు సమయంలో హీరోలాగా ప్రవర్తించడం ప్రమాదాన్ని పెంచుతుందని, వాలంటీర్లు క్రమశిక్షణతో పనిచేయాలని తెలిపారు. ముందస్తు సిద్ధతతో 99 శాతం ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.వాగులు, చెరువులు, ఎగువ జిల్లాల నీటి మట్టాలు, ట్రిగ్గర్ పాయింట్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వాగులతో అనుసంధానమైన చెరువుల నీటి మట్టాలను కూడా క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. చెరువు కట్టల్లో బలహీనతలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులకు గండిపడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందని, మున్సిపల్, పంచాయతీ శాఖలు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూలి వరదల సమయంలో రాకపోకలు నిలిచిపోయే కట్ ఆఫ్ రహదారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైనచోట్ల డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులను మరింతగా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాలను వెంటనే డిమార్కేషన్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపుకు గురయ్యే రహదారులను ట్రాక్టర్లతో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. కీలక ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసు సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్షణ చర్యలకు అవసరమైన అన్ని సామగ్రిపై వెంటనే ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూలి మండల స్థాయి బృందాల్లో స్థానిక యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. దీంతో వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం మరింత సులభమవుతుందని తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో కూడా వరదల సమయంలో సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు అన్ని గురుకుల విద్యాసంస్థలను పరిశీలించి ఎక్కడైనా నీటి ముంపు సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వరదల సమయంలో ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు విడుదలయ్యే పరిస్థితుల్లో దిగువ మండలాలకు ఇరిగేషన్ శాఖ ముందస్తుగా సమాచారాన్ని అందించాలని తెలిపారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూలి కొన్ని సందర్భాల్లో వరద నీటి ప్రవాహ వేగం చాలా అధికంగా ఉంటుందని, దీనిని కూడా అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. రాబోయే గంటలో ఎంత మేర వరద వచ్చే అవకాశం ఉందో ముందుగానే అంచనా వేయాలని తెలిపారు. తరలించేందుకు ఇబ్బందిగా ఉండే వృద్ధులను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రుల యాజమాన్యాలతో కుమ్మక్కై స్కానింగ్ సెంటర్ల దోపిడీ

ప్రవేట్ ఆసుపత్రులలో ఓటి అసిస్టెంట్లతో ఆపరేషన్ లు...?

తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు బొట్ల మహర్షి...వెల్లడి




హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండనగరం లో పిఆర్వోలతో కలిసి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రవేట్ హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లతో ఆపరేషన్లు చేపిస్తూ యాజమాన్యాలు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నయి అని తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్యం పరిరక్షణ సమితి అధ్యక్షుడు బొట్ల మహర్షి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహర్షి మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పరిధిలో ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ ఆపరేషన్ థియేటర్లలో డాక్టర్లు కాకుండా థియేటర్ అసిస్టెంట్లతో ఆపరేషన్లు చేపిస్తూ వందలాదిమంది చావులకు కారణమవుతున్నారని ఆరోపించారు. స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై పేద మధ్యతరగతి రోగులను అనవసర స్కానింగ్ ల పేరిట వేలాది రూపాయలు ఖర్చు చేపిస్తూ పేద మధ్య తరగతి వర్గాలను మరింత కుదేలుగా మారుస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉండే అమాయక గిరిజనులను టార్గెట్గా చేసుకొని పిఆర్ఓ, ఆర్ఎంపీలతో కలిసి హాస్పిటల్ యాజమాన్యాలు వైద్యం పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా వైద్య శాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశామని దానిపై విచారణ జరుగుతుందని విచారణ వేగవంతం చేసి సంబంధిత హాస్పిటల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజా ఆరోగ్య పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎచ్ టి విత్తనాలు కొని మోసపోవద్దు జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

నారాయణపేట మే 26:(లోకల్ గైడ్ న్యూస్): ప్రస్తుతం మార్కెట్లో ప్రచారంలో ఉన్న ఎచ్ టి పత్తి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు.ఇప్పటివరకు భారత ప్రభుత్వం అనుమతించిన పత్తి విత్తనాలు విత్తనాలు కావు, కేవలం పత్తి విత్తనాలు మాత్రమే చట్టబద్ధంగా అనుమతిం చబడ్డాయనీ తెలిపారు.ఎచ్ టి (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేదనీ స్పష్టం చేశారు.ఎచ్ టి పత్తి విత్తనాలను విత్తడం వలనకలుపు మందులు అధికంగా వాడాల్సివస్తుందని తెలిపారు.పంట పెరుగుదల సక్రమంగా రాదని, దిగుబడి సరిగారాదని అన్నారు. రైతులకు అధిక ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు.అదేవిధంగా ఎచ్ టి పత్తి విత్తనాలు విత్తిన పొలాల్లో కలుపు మందుల వాడకం వల్ల భూమి సారత తగ్గడం, పర్యావరణానికి హాని కలగడం, మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభా వాలు చూపే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఎచ్ టి పత్తి విత్తనాలపై చట్టపరమైన నిబంధనలుఅనుమతి లేకుండా పత్తి విత్తనాల ఉత్పత్తి, నిల్వ, విక్రయం వినియోగం చట్ట విరుద్ధమని అన్నారు.ఇలాంటి విత్తనాలను విక్రయించినా లేదా రైతులు వినియోగించినా విత్తనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు.రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలోప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని,తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని, అనుమానం ఉన్న విత్తనాల గురించి వ్యవసాయ అధికా రులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

# అర్ధరాత్రి చెక్ పోస్టులను ఆకస్మికంగాతనిఖీ చేసిన ఎస్పీ




నారాయణపేట మే 26(లోకల్ గైడ్ న్యూస్)::బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, అక్రమ రవాణాల నియంత్రణ ప్రజలకు భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నారాయణపేటలోని ఎర్రగుట్ట చెక్ పోస్టును, దామ రగిద్ద మండలంలోని కాన్కు ర్తి బోర్డర్ చెక్ పోస్టును సంద ర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పనితీరును పరిశీ లించారు. చెక్ పోస్టుల వద్ద నిర్వహిస్తున్న వాహన తని ఖీలు, రాత్రి పూట భద్రతా చర్యలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలనతో పాటు పాయింట్ బుక్ నమోదు లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.జిల్లాలో ఏర్పాటు చేసిన మొత్తం 07 చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వ ర్తించే పోలీసులు, వెటర్నరీ డాక్టర్ లు 24ఐ7 అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఎలాం టి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించా రు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ బక్రీద్ పండు గను ప్రజలు ప్రశాంత వాతా వరణంలో జరుపుకునేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింద న్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలి పారు.అక్రమ మద్యం, గంజా యి, పశువుల అక్రమ రవా ణా, పేలుడు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిం చాలని పోలీసు అధికారుల కు ఆదేశించారు. ప్రజల భద్ర త విషయంలో ఎట్టి పరిస్థి తుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు.అలాగే ప్రజ లు కూడా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాల గురించి సమాచా రం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయ గలమని తెలిపారు.ఈ తనిఖీలలో సంబంధిత పోలీ సు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మరికల్ లో పశువుల సంత ఏర్పాటు చేయాలి మండల బీజేపీ నాయకుడు రాజేష్ యాదవ్



నారాయణపేట మే 26(లోకల్ గైడ్ న్యూస్)::మరికల్ మండల కేంద్రంలో పశువుల సంత ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు చొరవ తీసుకోవాలని మండల బిజెపి నాయకులు రాజేష్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు.పశువుల సంత ఏర్పాటు చేయడం ద్వారా గ్రామపంచాయతీకి మంచి ఆదాయం సమకూరుతుం దన్నారు. అదేవిధంగా చుట్టు పక్కల గ్రామాల రైతులు, పశువుల కాపరులు తమ పశువులను సులభంగా కొనుగోలు,అమ్మకాలు చేసు కునే అవకాశం కలుగుతుంద న్నారు.దీని వల్ల రైతులకు సమయం, రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ఆర్థికంగా కూడా లాభం చేకూరుతుం దన్నారు.మరికల్ ప్రాంతం వ్యవసాయం, పశుసంవర్ధక రంగానికి కేంద్రంగా ఎదగడా నికి ఈ సంత ఎంతో ఉపయోగపడుతుందన్నారు.స్థానిక వ్యాపారాలకు ఊత మివ్వడంతో పాటు గ్రామ అభివృద్ధికి కూడా దోహదప డుతుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని,...

# పేటలో ఘనంగా గజ్జలేశ్వరీదేవి బోనాలు



నారాయణపేట మే 26:(లోకల్ గైడ్ న్యూస్): నారాయణపేట జిల్లా కేంద్రం లో మంగళవారం శ్రీ గజ్జలేశ్వరీదేవి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ప్రతి ఏటా రోహిణి కార్తి మొదటి రోజు అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.ఈ సారి అమ్మవారి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు.గౌడుగుగెరి నర్సింలు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను వైభవోపేతంగా ఊరేగిస్తూ ఆలయానికి చేర్చారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.ఆతర్వాత అమ్మవారికి పూజారులు పెద్దబోణం సమర్పించారు.పెద్దబోణం సమర్పణ అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు.అమ్మవారికి భక్తులు కోళ్లు,మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఈసారి వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండించి సిరి సంపదలు కల్పించాలని అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.అమ్మవారికి మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటును అందించాలి

## వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులను కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

## కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 26 : వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ(డీ.జీ.ఎఫ్.టీ), ఎ.పీ.ఈ.డీ.ఎ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎం.ఎస్.ఎం.ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీ.జీ.ఎఫ్.టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగించడం, మార్కెటింగ్ మెలుకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ, పసుపు, వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డీ.జీ.ఎఫ్.టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ.చవాన్ మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి మారకం బలపడుతుందని, ఇది ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు వర్తింపజేస్తూ, అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు. నేటి పరిస్థితుల్లో ఈ-కామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి, అవగాహనను పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఉంటున్న ప్రాంతం నుండే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ఉత్పత్తుల ఎగుమతులు, వ్యాపార లావాదేవీలు జరపవచ్చని సూచించారు. డీ.జీ.ఎఫ్.టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్.శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, కే.జనార్ధన్ రెడ్డి, ఎ.పీ.ఈ.డీ.ఎ అధికారి నాయుడు, నాబార్డు డీ.జీ.ఎం ఎస్.ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

# 4 వ డివిజన్ లోని UPH కాలనీ ఖమ్మం గ్రానైట్స్



లోకల్ గైడ్ ' ఖమ్మం' సమీపము లో నివసిస్తున్న బోసిన విజయ గారు సుతారి పనిచేస్తూ వడ దెబ్బ కు గురై మరణించారు విషయము తెలిసిన వెంటనే వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి వారి కుటుంబానికి అండ గా నిలిచి ,ప్రభుత్వ అధికారులు రెవిన్యూ అధికారులు, వైద్యులు మరియు సిబ్బంది,పోలీసు అధికారులు మరియు సిబ్బంది గార్ల దృష్టి కి తీసుకువెళ్లి విన్నవించాను వారు స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి పోస్ట్ మార్టం నిర్వహించారు మీ దండా జ్యోతి రెడ్డి (అయ్యప్ప రెడ్డి) మాజీ కార్పొరేటర్ 4 డివిజన్ ఖమ్మం

# జూన్ 3న నకెరికల్ లో నిర్వహించే టీయూడబ్ల్యూజే మహాసభ ను విజయవంతం చేయండి.

జిల్లాలో సభ్యత్వ క్యాంపెయిన్ కు అనూహ్యమైన స్పందన.

27న సాయంత్రం తో సభ్యత్వాల నమోదు ముగింపు .

టీయూడబ్ల్యూజే(ఐజేయు) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . మే 26 . (లోకల్ గైడ్).జూన్ 3 వ తేదీన నకెరికల్ నియోజకవర్గ కేంద్రంలో టి యు డబ్ల్యు జే ( ఐజేయు ) జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు , ఈ జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుండి జర్నలిస్టులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు . మంగళవారం నల్లగొండలో టి యు డబ్ల్యు జే ఐ జే యు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం , ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి , టి యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామ నారాయణ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ. ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని వెల్లడించారు . నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కు ప్రింట్,ఎలక్ట్రాన్ మీడియా, చిన్న పత్రికలు, ఫోటో జర్నలిస్టులు,వీడియో జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు.ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికిని సంఘం బాధ్యులంతా సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 27న సాయంత్రంతో సభ్యత్వ నమోదు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇంకా సభ్యత్వ నమోదు పొందని వారు ఎవరైనా ఉంటే స్థానిక మండల నియోజకవర్గ జిల్లా బాధ్యులను సంప్రదించి సభ్యత్వ ము తీసుకోవాలని కోరారు.జిల్లాలోని ప్రతి జర్నలిస్టు హక్కుల కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని అన్నారు .జర్నలిస్టులకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులను అందిస్తామని ఇందుకోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

# డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించ డమే లక్ష్యం జిల్లా ఎస్పీ వినీత్



నారాయణపేట మే 26:నారాయణపేట జిల్లా ప్రజల కు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమా నికి విశేష స్పందన లభించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి తమ సమస్యల ను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడు తోందని ఆయనపేర్కొన్నారు.ఈ రోజు ఉదయం 11 గంట ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారు లు స్వయంగా ఎస్పీ కి ఫోన్ చేసి తమ సమస్యలను నేరు గా వివరించారు. ఈ కార్యక్ర మానికి మొత్తం 18 ఫోన్ కాల్స్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ ప్రాంతాల్లో, బెల్ట్ షాప్ ల ఎక్కువగా నడుస్తున్నాయి అని, భూ తగాదాలకు సంబంధించిన సమస్యలు రావడం జరిగింది, ఆరు బయట మద్యం సేవిస్తు న్నారు అని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని, డబ్బు లు తీసుకొని ఇవ్వకుండా చీటింగ్ చేస్తూనారు, పలువు రు తమ సమస్యలను తెలి యజేశారు.ఈ సమస్యల న్నింటినీ జిల్లా ఎస్పీ స్వయం గా నోట్ చేసుకొని సంబం ధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ అధికారుల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హామీఇచ్చారు.ప్రజల సమస్యల పరిష్కారం లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండద ని, పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తుందని, ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసు లను సంప్రదించాలని సూచించారు.ఇలాంటి దయ ల్ యువర్ ఎస్పీ కార్యక్రమా లను తరచూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే పోలీస్ శాఖ లక్ష్య మని ఎస్పీ తెలిపారు. ప్రజ లు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# గ్రామ భద్రతకు 'సిద్దిపేట సురక్ష నేత్ర'.. అహ్మదీపూర్‌లో 25 సీసీటీవీలు ప్రారంభించిన సీపీ రష్మి పెరుమాల్




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 26:గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్, ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన పోలీస్ -- మన ఊరు' కార్యక్రమం గ్రామస్తుల్లో విశేష స్పందన పొందింది. గ్రామాలను మరింత సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను కవర్ చేస్తూ ఏర్పాటు చేసిన 25 సీసీటీవీ కెమెరాలు మరియు 14 మైకులతో కూడిన ఆడియో కనెక్టివిటీ వ్యవస్థను సీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సీపీ రష్మి పెరుమాల్ వృద్ధులకు చేతికర్రలను పంపిణీ చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లాలని సూచిస్తూ గ్రామ యువత, పోలీస్ సిబ్బంది మధ్య నిర్వహించిన వాలీబాల్ మ్యాచ్‌కు టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు.ప్రధాన వేదికపై యాంటీ డ్రగ్స్, రోడ్డు భద్రతపై ప్రత్యేక వీడియోలను ప్రదర్శించగా, ఒగ్గు కళాకారులు జానపద గీతాల ద్వారా మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, హెల్మెట్ ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సీపీ రష్మి పెరుమాల్ మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో స్వేచ్ఛగా తమ సమస్యలను పంచుకోవాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను బలోపేతం చేయడమే 'మన పోలీస్ -- మన ఊరు' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీలు భద్రతా కవచాలుగా పనిచేస్తాయని, ప్రజలు వాటి నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాత్రి వేళల్లో మహిళలు బంగారు ఆభరణాలతో బయట నిద్రించవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



తొగుట (లోకల్ గైడ్) మే 26:తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవ రెడ్డితో కలిసి ఎల్లమ్మ--జమదగ్ని కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.డప్పుల నాదాలు, మంగళహారతులు, "జై ఎల్లమ్మ తల్లి" నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఎమ్మెల్యే అమ్మవారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకుని ప్రజల సుఖసంతోషాలు, రైతుల పంటల సమృద్ధి, యువత భవిష్యత్తు బాగుండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "ఎల్లమ్మ తల్లి అనుగ్రహం ఉంటే ఎండిన నేలల్లో కూడా పచ్చదనం వెల్లివిరుస్తుంది. భక్తితో కోరుకున్న ప్రతి కోరిక తల్లి కరుణతో నెరవేరుతుంది" అన్నారు. ఎల్లమ్మ తల్లి ప్రజల గుండెల్లో విశ్వాస దీపంగా వెలుగొందుతున్న ఆదిశక్తి అని కొనియాడారు.అనంతరం



మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షులు బండాకాడి అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఇదిలా ఉండగా వెంకట్రావుపేటలో జరిగిన మస్కురి సత్యం--కృపల కుమారుడు పరంజ్యోతి--భాగ్యశీల వివాహ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే సువర్ణ కుమారుని నామకరణ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, పలువురు సర్పంచులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జన హక్కులకై తెలంగాణ‘రక్షణ సేన’

## వెనక్కి పోయిన విద్యాసంస్థలను తెచ్చేవరకు వదిలేది లేదు!

జిల్లా కేంద్రంలో ‘టిఆర్ఎస్’ మహా ధర్నా సక్సెస్.. కలెక్టరేట్ షేక్!

జిల్లా నుంచి వెనక్కి వెళ్లిన ప్రభుత్వ విద్యాసంస్థలను వెనక్కి తీసుకురావాలి

తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్

జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ ధర్నా విజయవంతం

కలెక్టరేట్లో పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేత




నారాయణపేట మే 26: (లోకల్ గైడ్) జిల్లా హక్కుల సాధనకై తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) శంఖారావం పూరించింది. జిల్లా నుంచి వెనక్కి తరలించిన ప్రభుత్వ విద్యాసంస్థలను వెంటనే తిరిగి తీసుకురావాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం మంగళ వారం ఉప్పెనలా మారింది. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ నాయకత్వంలో మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించిన భారీ ధర్నా నిర్వహించగా అత్యంత విజయవంత మైంది. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన జనసం దోహంతో నారాయణపేట వీధులు హోరెత్తాయి. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పార్కు సమీపం లో తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. “కల్వకుంట్ల కవిత నాయక త్వం వర్ధిల్లాలి” అంటూ కార్యకర్తలు చేసిన నినాదాల తో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అనంతరం జరిగిన ధర్నాలో గవినోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వ ఉదాసీ నతపై ఘాటుగా విరుచుకు పడ్డారు. జిల్లా నుండి వెనక్కి పోయిన ప్రభుత్వ విద్యాసం స్థలను తక్షణమే నారాయణ పేటకు రప్పించి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభు త్వ ఆసుపత్రిని వెంటనే అందుబాటులోకి తేవాలని, నూతన ఎస్పీ కార్యాలయ నిర్మాణాన్ని యుద్ధప్రతిపా దికన పూర్తి చేయాలని అధికారులను కోరారు. అర్హులైన రైతులందరికీ ‘రైతు భరోసా’ నిధులను తక్షణమే జమ చేయాలని, జిల్లాలో నత్తనడకన సాగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలన్నా రు. వికారాబాద్‌లో ఉన్న పంచాయతీరాజ్ ఎస్సి నారా యణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని, అలా గే పాలమూరులో ఉన్న దేవాదాయ శాఖ కార్యాల యాన్ని తక్షణమే నారాయణ పేట జిల్లా కేంద్రానికి తరలిం చాలని గట్టిగా డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాకు జరుగుతున్న అన్యా యాన్ని చూస్తూ ఊరుకో మని, ప్రభుత్వ విద్యాసం స్థలను, కార్యాలయాలను వెనక్కి తీసుకువచ్చే వరకు మా పోరాటం ఆగదని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నా అనంతరం నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంద జేశారు. సమస్యలపై తక్షణ మే స్పందించాలని, లేనిప క్షంలో తదుపరి కార్యాచరణ తీవ్రంగా ఉంటుందని హెచ్చ రించారు.ఈ మహా ధర్నాలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు శ్రీనివాస్ రావు, కృష్ణ కిషోర్, కొడంగల్ పార్టీ ఇంచార్జి నీలి జనార్దన్, నారాయణపేట పట్టణ అధ్యక్షులు చంద్రు ముదిరాజ్, దామరగిద్ద పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, యువత అధ్యక్షులు మనోజ్ గౌడ్, కొత్తపల్లి అధ్యక్షులు శివకుమార్ , ఆశన్‌పల్లి నారాయణరెడ్డి, రమేష్, కాందేన్‌పల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, సాకలోనిపల్లి వెంకటేష్, నరేష్, భీమాషప్ప, నర్సింహ, చాకలి బసప్ప, లోకుర్తి మాణిక్యప్ప, వెంకటప్ప, కంసాన్‌పల్లి గోవిందు, మొగలమాడక నర్సిములు, పల్లెబండ గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ... ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ శ్రీనివాస్

ఖమ్మం, మే 26:లోకల్ గైడ్ :ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం వారు మే 27న (బుధవారం) ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు “నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఖమ్మం లలిత జ్యూవెలరీ వద్ద నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించ బడతాయి అని అన్నారు. ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించడం, కొత్తగా కవరైన సంస్థల యజమానులకు పరిచయం, ఆన్ లైన్ సేవల వివరాలు, పెన్షనర్ లకు జీవన్ ప్రమాణ, ఇతర సమస్యల పరిష్కారం, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజనపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బాల్య వివాహం -- బతుకు అగం”.. బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 26:99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లాలోని 26 మండలాల్లో తహసీల్దార్ల అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.సిద్దిపేట రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శారద మాట్లాడుతూ “బాల్య వివాహాలను నిర్మూలిద్దాం -- బాలల బంగారు భవిష్యత్తును కాపాడుదాం” అని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు.సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహం జరిపించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. బాల్య వివాహం నిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు, వివాహంలో పాల్గొన్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ బాలికను వివాహం చేసుకుంటే జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.చదువుకునే వయసులోనే పిల్లలకు వివాహాలు జరిపించడం ద్వారా వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.“బాల్య వివాహం నేరం -- చట్ట ప్రకారం శిక్షార్హం”, “బాల్య వివాహం చేసినా, చేసుకున్నా, ప్రోత్సహించినా రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా” అనే నినాదాలతో అధికారులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

## బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలకు ఎన్నో అనార్థాలు.



బాల్య వివాహాలు చట్టవిరుద్ధం - అంగన్వాడీ సూపర్ వైజర్ ఆర్. రేణుక

రాజేంద్రనగర్ (లోకల్ గైడ్ ): బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఆడపిల్లకు తనకే కాకుండా సమాజానికి కూడా ఎంతో నష్టమని ఆర్. రేణుక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ్లగూడలోని వార్డు కార్యాలయంలో బాల్యవివాహాల నివారణ- బాల్యవివాహా లు చేయటం వల్ల జరిగే నష్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు, 21 ఏళ్లు నిండిన తర్వాతే అబ్బాయిలకు వివాహాలు చేయాలని సూచించారు. అమ్మాయి అబ్బాయిలకు పెళ్లి వయసు రాకముందే వివాహాలు చేసినట్లయితే వారు శారీరకంగా ఆర్థికంగా ఇతర సమస్యలతో బాధపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వా నిబంధనల ప్రకారం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లలోపు వివాహాలు జరిపించినట్లయితే చట్టపరంగా ఇరు కుటుంబాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు బాలల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునన్నారు. బాల్య దశలో ఉన్నప్పుడు పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు సరైన విద్య బోధన క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో టెంట్ హౌస్ యజమాని రాందాస్, వేద పండితుడు రాజేశ్వర్ శర్మ, నాదస్వర బృందం, ఐసిడిఎస్ సిబ్బంది పి రాజేశ్వరి, సరస్వతి, విశాలిని, లలిత, నాగలక్ష్మి, తల్లిదండ్రులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం

## పల్లా నరసింహ రెడ్డి.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 26. టి జి ఆర్ టి సి ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ డిపో సమావేశం సిపిఐ కార్యాలయంలో డివి నారాయణ అధ్యక్షతన జరిగింది. 2019 నుండి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి చివరకు ఆర్టీసీలో కలిసి వచ్చే సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమ కార్యచరణ చేయడం జరిగిందని దేవరకొండ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ రెడ్డి తెలియజేసినారు. ఆర్ టి సి కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. కార్మిక వర్గ శ్రేయస్ కోసం సిపిఐ పార్టీ ఎప్పుడు ముందుండి పోరాడుతుందని అన్నారు.ఆరు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 24 ఫిబ్రవరి 2026న చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహించి కార్మికుల సమక్షంలో తేదీ 13 మార్చ్ 2026న సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని తేదీ 22 ఏప్రిల్ 2026న సమ్మె ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి 32 డిమాండ్లను అంగీకరించిందని, ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేస్తామని 2021 వేతన సవరణను 11% గా అమలు చేయడానికి మరియు ఆర్టీసీలో యూనియన్ కార్యకలాపాలను కొనసాగించుకోవడానికి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కి ఆదేశాలు ఇవ్వటం జరిగిందని తెలియజేశారు. ఆర్టీసీలో కొన్ని కార్మిక సంఘాలు సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేసిన మొక్కవోని ధైర్యంతో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆరు సంఘాల జీూజ కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున సమ్మెను జయప్రదం చేసినదని తెలియజేశారు. వేతన సవరణ 1/4/2021 నుంచి అమలు చేయుటానికి అంగీకరించినారని 2017 వేతన సవరణకు సంబంధించిన రిటైర్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి మరియు 2021 వేతన సవరణ బకాయిలను కూడా రిటైర్ ఉద్యోగులకు చెల్లించడానికి అంగీకరించినారని తెలియజేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జేఏసీ ఆధ్వర్యంలో చారిత్రక ఉద్యమం నిర్వహించి 32 డిమాండ్ లు సాధించుకోవడం జరిగిందని తెలియజేసినారు. ఇప్పుడు ఆర్టీసీ కార్మిక వర్గం అంత ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ను బలపరచి బలోపేతం చేయాలని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ గౌరవ అధ్యక్షుడు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల కోసం ఏఐటియుసి ఎప్పుడు అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కు ఎంప్లాయిస్ యూనియన్ ఎప్పుడు పాటుపడుతుందని ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎంప్లాయిస్ యూనియన్ ఎప్పుడు ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాండురంగయ్య నల్లగొండ రీజియన్ కార్యదర్శి ఎన్.ఆర్.సి. రాజు అధ్యక్షుడు జమాల్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విరుగదిండ్ల శ్రీనివాస్, డివి నారాయణ, యాదయ్య, ఎండి మైనుద్దీన్,హరి,మన్సూర్,హాసన్ బాబా,వి జే రెడ్డి, జానీ పాషా లక్ష్మయ్య,నిరంజన్,మహేందర్ ,వెంకన్న, ఎం ఆర్ రెడ్డి, బెగ్, తదితరులు పాల్గొన్నారు.అనంతరం డిపో నూతన కమిటీ నీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ గా జానీ పాషా,అధ్యక్షులుగా పెరుమాండ్ల హరి,కార్యదర్శిగా వడ్లపల్లి జనార్ధన్ రెడ్డి,కోశాధికారిగా దార యాదయ్య, ఉపాధ్యక్షులుగా కేవీఎన్ రావు, సహకార దర్శిగా నల్ల లక్ష్మయ్య ముఖ్య సలహాదారులుగా డివి నారాయణ లను ఎన్నుకోవడం జరిగింది

## రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ




ములుగు జిల్లా, కన్నాయిగూడెం : లోకల్ గైడ్ :మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కన్నాయిగూడెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం రైతు వేదికలో మండల కాంగ్రెస్ నాయకులు, రెవిన్యూ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన దేపాక సమ్మక్క, సునార్కని సమ్మక్క, వాసంపెల్లి లక్ష్మి, చేర్ప కృష్ణవేణి, పీర్ల ఎల్లక్క, మల్లెల మంజుల, గడ్డం సరోజినీ, బొమ్మరాజు రమ, ఆకుతోట రమాదేవి, మహమ్మద్ సుమయా, షైక్ ముంతాజ్, బొచ్చు లక్ష్మి, కోరం శ్యామల, ఆలం కమలక్క, బొడ్డు లలిత, మడప పద్మ, తోట సరోజన తదితరులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ అప్సర్ పాషా, మండల ఇంచార్జి (సర్పంచ్) జాడి రాంబాబు, మండల రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్, జీపీవోలు, రెవిన్యూ సిబ్బంది, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం నాగేశ్వర్ రావు, గుర్రవుల సర్పంచ్ అంబాలా సౌజన్య, తుపాకులగూడెం సర్పంచ్ పీరిలా స్వప్న, చింతగూడెం సర్పంచ్ అల్లెం అనిత, ఏటూరు సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అపోహలు,వదంతులు నమ్మవద్దు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలతో కలిగించే అపోహలు,వదంతులను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత,కొనుగోళ్ళలో పూర్తిస్థాయి నిలిచిపోయిన పరిస్థితి లేదని,అవసరానికి అనుగుణంగా లారీలు,హమాలీలు,గోనె సంచులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం జిల్లాలో దాదాపు1లక్ష 50వేల నుండి1లక్ష 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుండగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు1లక్ష 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని,మిగిలిన ధాన్యం కొనుగోలు,రవాణా ప్రక్రియను10నుండి 12రోజులలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతున్నామని,గతంతో పోలిస్తే ఈసారి కొనుగోలు,రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు.రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ,పౌరసరఫరాలు,ఎస్ డబ్ల్యూ సి శాఖల అధికారులు నిరంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని,రాజకీయ ప్రయోజనాల కోసం చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులను కోరారు.

## చైన్ స్నాచింగ్ కేసును గంటల్లో ఛేదించిన పేట్ బషీరాబాద్ పోలీసులు

-మహిళపై దాడి చేసి బంగారు గొలుసు అపహరించిన నిందితుడు అరెస్ట్

-30 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం..డిసిపి ఎన్.కోటిరెడ్డి




సైబరాబాద్, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): పేట్ బషీరాబాద్ పోలీసులు చైన్ స్నాచింగ్ కేసును తక్కువ సమయంలోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి అపహరించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. మే 25న కొంపల్లి జయభేరి పార్క్ ప్రాంతంలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనపై డయల్-100కు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలు బిజ్జం మల్లేశ్వరి (40), జయభేరి పార్క్‌లోని బి.ఆర్. ఫ్రెష్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఆయిల్ స్టోర్ యజమాని. సాయంత్రం సమయంలో ఓ యువకుడు దుకాణంలోకి ప్రవేశించి ఆయిల్ బాటిళ్లు విసిరి, ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనను గమనించిన స్థానికులు నిందితుడిని వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అరెస్టు చేసిన నిందితుడు మల్లాడి నరసింహ అలియాస్ నాని (23), ఈస్ట్ గోదావరి జిల్లా వాసి కాగా ప్రస్తుతం అమీర్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఉద్యోగం కోల్పోవడంతో ఈజీ మనీ కోసం చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అతని వద్ద నుంచి సుమారు 30.453 గ్రాముల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మహారాష్ట్రకు చెందిన హసన్ అలీ అనే ఇరానీ గ్యాంగ్ సభ్యుడిని కూడా పేట్ బషీరాబాద్ పోలీసులు చైన్ స్నాచింగ్ కేసులో అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకునేందుకు సహకరించిన స్థానిక ప్రజలను తెలంగాణ రాష్ట్ర పోలీసులు అభినందించా రు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

## జూన్ 2 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభం

-అర్హులైన లబ్ధిదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన



హైదరాబాద్, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసింది. జూన్ 2వ తేదీ నుంచి అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేయ నున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన అర్హతల ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఇంకా దరఖాస్తు చేయని అర్హులు వెంటనే తమ దరఖాస్తులను సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయా లు, ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు దారులు ఫారంలో వ్యక్తిగత వివరాలు, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, సంబంధిత పింఛన్ కేటగిరీ వివరాలను నమోదు చేసి అవసర మైన ధ్రువీకరణ పత్రాలను జతచేసి సమర్పించాలి. అధికారు లు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి జూన్ 2 నుంచి పింఛన్లు మంజూరు చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..పూర్తి వివరాలతో సరైన పత్రాలను సమర్పించాలని ప్రజలకు సూచించారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత అధికారులను లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. “పింఛన్లకు కేటగిరీల వారీగా అర్హతలు ప్రకటించిన ప్రభుత్వం”.”వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగుల కు ప్రత్యేక నిబంధనలు”కొత్త పింఛన్ల మంజూరు లో భాగంగా ప్రభుత్వం కేటగిరీల వారీగా అర్హతలను స్పష్టం చేసింది. వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు కనీసం 57 సంవత్సరాలు పూర్తి చేసి ఉండాలి. వితంతు పింఛన్ కోసం భర్త మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. ఒంటరి మహిళల పింఛన్ కోసం మహిళ వయస్సు 18 సంవత్సరాలు నిండినదై ఉండటంతో పాటు కుటుంబ మద్దతు లేకుండా జీవనం సాగిస్తున్నట్లు ధ్రువీకరణ అవసరం. వికలాంగుల పింఛన్ కోసం కనీసం 40 శాతం వైకల్యం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు ప్రభుత్వ వైద్యాధికారులు జారీ చేసిన వైకల్య ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. అవసరమైతే ఆసుపత్రి లేదా ఇతర వైద్య పత్రాలను కూడా జతచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన అర్హతలు కలిగిన వారు జూన్ 2కు ముందుగా, లేదా తర్వాత దరఖాస్తులను పూర్తి చేసి సమర్పించాలని అధికారులు కోరుతున్నారు.

## వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి...

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు,నిల్వ,రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్,శ్రీ సాయి మణికంఠ రైస్ మిల్ లను మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి,నిల్వ ప్రక్రియలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు దాన్యం నిల్వ,తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం,ఇటిక్యాలలోని కొనుగోలు కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం



నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు.ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు,నీడ సౌకర్యాలు కల్పించడంతోపాటు గోనె సంచులు,టార్పాలిన్ కవర్లు,తూకం యంత్రాలు,ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు.కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు.అనంతరం మంచిర్యాల పట్టణంలోని ఎసిసిలోని హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,మంచిర్యాల,బెల్లంపల్లి,తాండూరు తహసిల్దార్లు రఫతుల్లా,కృష్ణ,జ్యోత్స్న లతో కలిసి సందర్శించారు.ప్రభుత్వం రైతుల కొరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని,లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## పబ్లిక్ నోటీస్ నేను గట్ల రాజేందర్, తండ్రి వెంకట్ రాములు, నివాసం

శేరిలింగంపల్లి, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి) పబ్లిక్ నోటీస్ నేను గట్ల రాజేందర్, తండ్రి వెంకట్ రాములు, నివాసం: ఇంటి నం. 2-145/1, శివాలయం దగ్గర, నాదర్‌గుల్, రంగారెడ్డి జిల్లా. తేదీ 25-05-2026 న శేరిలింగంపల్లి ప్రాంతంలో ఆటోలో ప్రయాణించే సమయంలో నా ఒరిజినల్ ప్లాట్ డాక్యుమెంట్లు ఉన్న ఫైల్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా ఆ డాక్యుమెంట్లు దొరికిన యెడల దయచేసి సమీప పోలీస్ స్టేషన్‌కు అప్పగించగలరు లేదా క్రింది నంబర్‌కు సమాచారం ఇవ్వగలరు.మొబైల్: 96525 45425సంతకంగట్ల రాజేందర్

## పెద్దేముల్‌లో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్.

- ఈనెల 28 నుంచి క్రికెట్ మ్యాచ్‌ల ప్రారంభింభం.

- నేడు ఆయా టీములకు సంబంధించి జిల్లా పరిషత్ మైదానంలో "డ్రా" కార్యక్రమం.

- ప్రతి మ్యాచ్ 8 ఓవర్లు -- ఫైనల్ మ్యాచ్ 10 ఓవర్లు.

- టోర్నమెంట్ నిర్వాహకుల పిలుపు.




లోకల్ గైడ్/ తాండూర్:పెద్దేముల్ మండలంలో క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఈనెల 28వ తేదీ(గురువారం) నుంచి మండల స్థాయిలో పర్యాద రాములు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు పర్యాద అరుణ్, ప్రవీణ్, శంకర్ గౌడ్ తదితరులు తెలిపారు.ఈ టోర్నమెంట్ ప్రతి మ్యాచ్‌ను 8 ఓవర్ల ఫార్మాట్‌లో నిర్వహించనుండగా, ఫైనల్ మ్యాచ్‌ను 10 ఓవర్లతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.టోర్నమెంట్‌కు సంబంధించిన డ్రా కార్యక్రమం నేడు(బుధవారం) జిల్లా పరిషత్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. అందులో పాల్గొనే జట్లను ఖరారు చేసి మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటించనున్నట్లు తెలిపారు.ఆసక్తి కలిగిన క్రీడాకారులు, ఆయా గ్రామాల జట్లు ఈరోజు సాయంత్రంలోగా తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఆలస్యంగా వచ్చే దరఖాస్తులను పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.మండలంలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా క్రీడాకారులు గుర్తించుకోవాల్సిన విషయం, ఏ గ్రామానికి చెందిన వ్యక్తి అదే టీంలో మాత్రమే ఆడాలి. దీనిని ఆధారం ధ్రువీకరణ ఆధారంగా నిర్ధారిస్తామని వెల్లడించారు.

## రైతులకు అందుబాటులో జనుము విత్తనాలు.

## - పెద్దేముల్ మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతం.



లోకల్ గైడ్/తాండూర్ రైతులకు జనుము విత్తనాలు అందు బాటులోకి తీసుకొచ్చామని పెద్దేముల్ మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జనుము 40 కిలోల బస్తా రూ.3110.ఒక్క బస్తా జనుము సుమారు 2.5 ఎకరాలకు వాడుకోవచ్చు అన్నారు. ముఖ్యంగా జనుము యొక్క ఉపయోగాలు..యూరియా వాడకాన్ని తగ్గించవచ్చు.నేల సూక్ష్మజీవుల రక్షణ,ఎరువులపై ఖర్చును తగ్గించవచ్చు.నేలలో సేంద్రీయ కార్బన్‌ను మెరుగుపరచవచ్చు.తక్కువ పెట్టుబడితో అధిక రాబడి.నేలల్లో నత్రజని శాతాన్ని పెంచవచ్చు అని స్పష్టం చేశారు. అదేవిధంగా జానుమును అన్ని రకాల పంటలలో వినియోగించుకోవచ్చని వెల్లడించారు.జనుములు కావాల్సిన వారు పెద్దేముల్ మండల కేంద్రంలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పట్టా పాస్‌బుక్ ,ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ సమర్పించాలని చెప్పారు.

## మతసామరస్యంతో పండుగలు జరుపుకోవాలి : సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

-బక్రీద్ సందర్భంగా మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించిన సైబరాబాద్ పోలీసులు

-ప్రజలు పోలీసులకు సహకరించాలి..డిసిపిలు





సైబరాబాద్, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ప్రజలంతా మత సామరస్య వాతావరణంలో శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలని కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ..బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, మత పెద్దలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు కఠిన నిఘా ఉంచుతున్నారని తెలిపారు. ఎవరైనా అల్లర్లు లేదా గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగల సమయంలో సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, పాత వీడియోలు, అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం గమనించిన వెంటనే పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు గత 45 రోజులుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీపీ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేస్తున్నామని చెప్పారు. కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలను నిర్వహించుకోవాలని కోరారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ..సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. వాలంటీర్లు, యువత ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగస్వాములు కావాలని కోరారు. కూకట్పల్లి డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ..పీస్ కమిటీ సభ్యులు సమాజంలో శాంతి స్థాపనకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబరాబాద్ పరిధిలోని పలువురు పోలీసు అధికారులు, హిందూ-ముస్లిం మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ దాడులలో వందల కోట్ల అక్రమాస్తులు వెలుగులోకి

-ఇరిగేషన్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, కమర్షియల్ టాక్స్ శాఖలలో భారీ అవినీతి బహిర్గతం




హైదరాబాద్, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): రాష్ట్రంలో కీలక ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న పలువురు ఉన్నతాధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఇటీవల నిర్వహించిన దాడులలో వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, కమర్షియల్ టాక్స్, వాటర్ బోర్డు శాఖలకు చెందిన అధికారుల వద్ద భారీగా నగదు, బంగారం, భూములు, బినామీ ఆస్తులు బయటపడినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కీలక పదవులలో పనిచేసి భారీ స్థాయిలో అక్రమ సంపాదనకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో పట్టుబడిన కొందరు రెవెన్యూ అధికారుల వద్దే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలుస్తోంది. "ప్రధాన అధికారులపై నమోదైన ఆరోపణలు..అక్రమాస్తుల వివరాలు" ఇరిగేషన్ శాఖలో భారీ అవినీతి ఆనంద్ కుమార్ (ఏడీ, ఎలక్ట్రిసిటీ విభాగం) కాళేశ్వరం ప్రాజెక్ట్ విద్యుత్ పనుల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించిన ఈ అధికారి వద్ద సుమారు రూ.120 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. బినామీ భూములు, ఓపెన్ ప్లాట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. సుధాకర్ రెడ్డి (చీఫ్ ఇంజనీర్) ప్రాజెక్ట్ నిర్మాణ ప్యాకేజీలు, బిల్లుల మంజూరులో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన వద్ద రూ.270 కోట్లకు పైగా అక్రమాస్తులు గుర్తించినట్లు సమాచారం. వెంకటేశ్వర్లు (సూపరింటెండింగ్ ఇంజనీర్)కాంట్రాక్టుల పొడిగింపులు, నాణ్యతా ప్రమాణాల విషయంలో అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.230 కోట్ల విలువైన ఆస్తులు బయటపడినట్లు తెలిసింది. "వాటర్ బోర్డు..ట్రాన్స్‌పోర్ట్ శాఖలలో దందా" సగ్గం అనంత లక్ష్మీకుమార్ (జనరల్ మేనేజర్, హైదరాబాద్ వాటర్ బోర్డ్) నీటి ఎద్దడిని ఆసరాగా చేసుకుని అనధికారిక ట్యాంకర్ నెట్‌వర్క్ నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగదు, బంగారం, భూముల రూపంలో రూ.100 కోట్లకు పైగా ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. మూడ్ కిషన్ (డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్) ట్రాన్స్‌పోర్ట్ శాఖలో అక్రమ వసూళ్లు, బినామీ ఆస్తుల వ్యవహారాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.100 కోట్ల అక్రమాస్తులు ఉన్నట్లు తెలిసింది. సత్యనారాయణ రావు (రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్) ట్రావెల్స్, లారీ ఫిట్‌నెస్, పర్మిట్ల మంజూరులో భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.105 కోట్లకు పైగా ఆస్తులు బయటపడినట్లు సమాచారం. "రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో అక్రమాలు" జ్యోతి (మున్సిపల్ కమిషనర్, బండ్లగూడ జాగీర్) ఆక్రమ నిర్మాణాలకు అనుమతులు, ప్రభుత్వ భూముల కబ్జాలకు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారీ స్థాయిలో ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. సీహెచ్ కనకరాజు (డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్) వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్లలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.130 కోట్లకు పైగా అక్రమాస్తులు బయటపడినట్లు తెలుస్తోంది. పి.రాధాకృష్ణ (సబ్ రిజిస్ట్రార్, మేడ్చల్) అక్రమ లేఅవుట్లు, వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా భారీగా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. "కమర్షియల్ టాక్స్, ఆర్ అండ్ బీ శాఖలలో అవినీతి" రమేష్ కుమార్ (జాయింట్ డైరెక్టర్, కమర్షియల్ టాక్సెస్) జీఎస్టీ ఎగవేత కేసులలో ఆడిట్ నివేదికలను మార్చి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.150 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. హరి భూషణ్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రోడ్లు అండ్ భవనాలు) ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, కాంట్రాక్టుల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.110 కోట్ల అక్రమాస్తులు బయటపడినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలలో అవినీతి వ్యవస్థీకృత స్థాయికి చేరిందనే విమర్శలు ఈ ఘటనలతో మరింత బలపడుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్టులు, భూ రిజిస్ట్రేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లు, వాటర్ ట్యాంకర్ నెట్‌వర్క్‌ల వంటి రంగాలలో అధికార, వ్యాపార వర్గాల మధ్య కుమ్మక్కు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గత కొన్నేళ్లుగా కీలక స్థానాలలో పనిచేసిన అధికారుల ఆస్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపితే మరింత పెద్ద అవినీతి బాగోతం బయటపడే అవకాశం ఉందని రాజకీయ, ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నష్టాల భారం తగ్గాలంటే మరో భారీ పెంపు?

## -పెట్రోల్, డీజిల్ ధరలు ఇంకా పెరగొచ్చన్న సంకేతాలు

-ఇప్పటికే రూ.8 పెంపు..ఇంకా రూ.28 వరకు బాదుడు?

-ఆయిల్ కంపెనీల నష్టాల రికవరీ కోసం దశలవారీగా ధరల పెంపు అవకాశం



హైదరాబాద్, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు మరో షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. గత 11 రోజుల వ్యవధిలోనే లీటరుకు దాదాపు రు.7 నుంచి 8 వరకు పెంచిన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసి ల), ఇంకా తమ నష్టాల నుంచి పూర్తిగా బయటపడలేదని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి సమస్యల కారణంగా దిగుమతి వ్యయం అమాంతం పెరిగిందని పేర్కొంటున్నాయి. ఎన్డిటివి కథనం ప్రకారం, గత కొన్ని నెలలుగా వచ్చిన నష్టాలను పూర్తిగా రికవర్ చేసుకోవాలంటే పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు మరో రు.28 నుంచి రూ.33 వరకు పెంచాల్సిన పరిస్థితి ఉందని ఆయిల్ కంపెనీలు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. అయితే ఒకేసారి అంత భారీ పెంపు ఉండకపోయినా, దశలవారీగా ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భారతదేశం తన అవసరాలలో 85 శాతం కంటే ఎక్కువ ముడి చమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఇటీవల ఇరాన్ యుద్ధ పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి అంతరాయాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్ లో బ్యారెల్ చమురు ధరలు భారీగా ఎగబాకాయి. ఫిబ్రవరిలో సుమారు 69 డాలర్ల వద్ద ఉన్న ఇండియన్ బాస్కెట్ క్రూడ్ ధర మే నాటికి 109 డాలర్లకు చేరినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఆయిల్ కంపెనీలపై భారీ ఆర్థిక భారం పడింది. ఇప్పటికే వరుస పెంపుల వల్ల ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ వంటి నగరాలలో పెట్రోల్ ధరలు రూ.100 దాటాయి. డీజిల్ ధరలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, కూరగాయలు, నిత్యావసర సరుకులు, నిర్మాణ సామగ్రి, పాలు, గ్యాస్ వంటి వస్తువుల ధరలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇంధన ధరల పెంపు తక్కువగానే ఉందని చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఇంధన భారం వల్ల సామాన్యుడి జీవితం మరింత కష్టాల్లోకి వెళ్తోంది అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

## బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్..



రామకృష్ణాపూర్ (లోకల్ గైడ్)ఈనెల 28న నిర్వహించనున్న బక్రీద్ పండుగ పురస్కరించుకొని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు తారక రామ కాలనీ డబల్ బెడ్ రూమ్ ఈద్గా పరిసరాల్లో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య,అభివృద్ధి పనులను క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి మంగళవారం పరిశీలించారు.పండుగ సందర్భంగా ఈద్గా వద్దకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండటంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈద్గా పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగింపు,తాగునీటి సౌకర్యం,వీధి దీపాల నిర్వహణ వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రజల ఆరోగ్యం,పరిశుభ్రతకు మున్సిపాలిటీ ఎల్లప్పుడు ప్రాధాన్యత ఇస్తుందని చైర్‌పర్సన్ తెలిపారు.పండుగ రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా దర్గా పరిసర ప్రాంతాలను పూర్తిగా పరిశుభ్రంగా ఉంచి,పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.పండుగ వాతావరణానికి అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో మున్సిపాలిటీ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ కౌడగొని సంబయ్య,6వ వార్డ్ కౌన్సిలర్ మద్దెల శంకర్,14వ వార్డు కౌన్సిలర్ కొప్పి రాజశేఖర్,మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్,శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్,ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సంతోష్,మైనారిటీ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్,మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీ వివాహ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొని



శేరిలింగంపల్లి, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రముఖ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ నాయకులు మారబోయిన రవి యాదవ్ పాల్గొని దంపతులకు సిల్వర్ జూబ్లీ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..కొమిరిశెట్టి సాయిబాబా దంపతులు ప్రేమ, పరస్పర అవగాహన, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలుస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు. వారి దాంపత్య జీవితం ఇలాగే ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్య సంపదలతో మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. 25 సంవత్సరాల వైవాహిక జీవితం పూర్తి చేసుకోవడం ఎంతో గొప్ప విషయం అని పేర్కొంటూ, దంపతులు ఇలాగే సమాజ సేవలో ముందుండి ప్రజల ప్రేమాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నివారణ సాధ్యం



భద్రాచలం/దుమ్ముగూడెం : లోకల్ గైడ్ :బాలికలు 14 సంవత్సరాలు దాటిన తర్వాత తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని పూణేం కృష్ణ తెలిపారు. అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లలకు యుక్త వయసు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలని సూచించారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రాజెక్టు పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల సందర్భంగా భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో జ్యోతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చిన్నారులకు రక్తహీనత రాకుండా పోషకాహారం సక్రమంగా అందించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా బాలామృతం అందజేసి, పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అధికంగా జరుగుతున్న బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరగాలని చెప్పారు. మైనారిటీ తీరకముందు వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రులు, పురోహితులు, గ్రామ పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఐసీడీఎస్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని, లేకపోతే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. అలాగే యువజనులు మానవ అక్రమ రవాణా నివారణపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం హాజరైన బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

## "బాల్య వివాహం -- బతుకు అగం".. బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 26:99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లాలోని 26 మండలాల్లో తహసీల్దార్ల అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక



అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.సిద్దిపేట రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శారద మాట్లాడుతూ "బాల్య వివాహాలను నిర్మూలిద్దాం -- బాలల బంగారు భవిష్యత్తును కాపాడుదాం" అని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు.సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహం జరిపించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. బాల్య వివాహం నిర్వహించిన వారు, ప్రోత్సహించిన వారు, వివాహంలో పాల్గొన్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ బాలికను వివాహం చేసుకుంటే జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.చదువుకునే వయసులోనే పిల్లలకు వివాహాలు జరిపించడం ద్వారా వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు."బాల్య వివాహం నేరం -- చట్ట ప్రకారం శిక్షార్హం", "బాల్య వివాహం చేసినా, చేసుకున్నా, ప్రోత్సహించినా రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా" అనే నినాదాలతో అధికారులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

# కాళేశ్వరంలో “బాల్య వివాహం బతుకు ఆగం” అవగాహన సదస్సు

నిబంధనలు ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా.

బాల్య వివాహాల సమాచారానికి 1098 లేదా 100 నంబర్లకు ఫోన్ చేయాలి

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం: అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్



భూపాలపల్లి (లోకల్ గైడ్ ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక” మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాళేశ్వరం గ్రామంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ “బాల్య వివాహం -- బతుకు ఆగం” కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లా పోలీస్ విభాగపు అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.బాల్యవివాహాలు చేయడం చట్టప్రకారం నేరమని స్పష్టం చేశారు. బాల్యవివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం పెళ్లిళ్లు చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నేటి బాలలే రేపటి దేశ పౌరులని, చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్తును అంధకారం చేయవద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించి బాలికల భవిష్యత్తును కాపాడాలని ప్రజలను కోరారు.ఈ సదస్సులో సీడీపీఓ రాధిక మేడం మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందని, గర్భధారణ సమయంలో రక్తహీనత, ప్రసవ సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు నెత్తిన పడటం వల్ల గృహహింస, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ బాల్యాన్ని కోల్పోతారన్నారు. సమాజ అభివృద్ధికి బాల్యవివాహాలు పెద్ద ఆటంకమని పేర్కొన్నారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న కిషోర్ బాలికల చిక్కిపట్టీలు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తమాషా రెడ్డి, భరోసా ఎస్సై స్వప్నకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్పందన, రమాదేవి, కాళేశ్వరం ఉపసర్పంచ్ సుధీర్, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి సాయిరాం, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, ఏ. జ్యోతి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే పరిశ్రమల వైపు అడుగులు వేయాలి

-రైస్ మిల్లులు, గోడౌన్లు స్థాపిస్తే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది

-కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు..మిరియాల ప్రీతమ్




శేరిలింగంపల్లి, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా బలపడాలని, ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన రైస్ మిల్లులు, గోడౌన్లు, నిల్వ కేంద్రాల ఏర్పాటు వైపు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, పారిశ్రామిక ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువతులు వ్యవసాయానికి అనుబంధంగా ఉండే వ్యాపార రంగాలలో ప్రవేశిస్తే కుటుంబాల ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడుతుందని అన్నారు. ముఖ్యంగా ధాన్యం నిల్వ, రైస్ మిల్లింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగాలలో భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలకు రుణ సదుపాయాలు, సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు, భూమి కేటాయింపులు, విద్యుత్ సౌకర్యాలు వంటి అంశాలలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు పండించిన ధాన్యానికి సరైన నిల్వ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మహిళలు గోడౌన్లు ఏర్పాటు చేస్తే రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. మహిళలు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా యజమానులుగా ఎదగాలని, వ్యాపార రంగంలో అడుగుపెట్టి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకొస్తున్న పారిశ్రామిక విధానాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ముందుకు వస్తే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మహిళా సంఘాలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మిరియాల ప్రీతమ్ పేర్కొన్నారు.

# సురవరం ప్రతాప్ రెడ్డి జయంతి ఉత్సవాలకు ముస్తాబవుతున్న పార్క్



వనపర్తి లోకల్ గైడ్ మే26:(అంబటిస్వామి ప్రతినిధి) తెలంగాణ వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞా శాలి వనపర్తి మొట్టమొదటి ఎం.ఎల్.ఏ సురవరం ప్రతాప్ రెడ్డి 130వ జయంతి వేడుకలకు పార్కు ముస్తాబు చేస్తున్నారు. సురవరం పార్క్ దగ్గర పా రిశ్యుద్ధ పనులను జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ స్థానిక కౌన్సిలర్ ఏర్వ.అరుణశ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా నందిమల్ల అశోక్ మాట్లాడుతూ సురవరం.ప్రతాప్ రెడ్డి పాత్రికేయులు , సాహితీవేత్తగా, రాజకీయనేత గా సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు అని ఆయన కొనియాడారు. వారిని స్మరించుకుని జీవిత విశేషాలు భావితరాలకు అందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గ ఆధ్వర్యములో 130వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలలో మేధావులు,విద్యావేత్తలు, సాహితీవేత్తలు, జర్నలిస్టులు,కవులు, కళాకారులు, సామాజిక విశ్లేషకులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల శ్రేణులు విధిగా హాజరై ఘనంగా నివాళులు అర్పించాలని ఆయన కోరారు.

# 31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే 26 (లోకల్ గైడ్ తెలంగాణ)పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలు జరగనున్నాయని వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అండర్-16, అండర్-18, అండర్-20 విభాగాలతో పాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అండర్-16 విభాగంలో 100 మీటర్లు, 300 మీటర్లు, లాంగ్ జంప్, అండర్-18 విభాగంలో 100 మీటర్లు, 1000 మీటర్లు, అండర్-20 విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పోటీలు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగులతో పాటు 5 కిలోమీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయోపరిమితి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ప్రతి అథ్లెట్‌కు రూ.100 ప్రవేశ రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు o91 96183 36976 ఫోన్ నంబర్ ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని నిర్వాహకులు కోరారు.

# సాగు, తాగు నీరు ఎద్దడి తీర్చడానికి ఇరిగేషన్ అధికారులు ప్రతి పాదనలు సిద్దం చేయాలి..

-- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి..



వనపర్తి లోకల్ గైడ్ మే 26 :(అంబటి స్వామి ప్రతినిధి).వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, తాగు నీటి సమస్య తీర్చడానికి అవసరమైన ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా సందర్శించి సాగు, తాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించనున్న నేపథ్యంలో వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, భవిష్యత్తులో సైతం తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి సూచించారు. మంగళవారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పాలమూరు రంగారెడ్డి , మహాత్మగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పురోగతి, ఇంకా మిగిలి ఉన్న పెండింగ్ పనుల పై నాగర్ కర్నూల్ జిల్లాలా వట్టెం రిజర్వాయర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లాల ఇరిగేషన్ సమీక్షలో శాసన సభ్యులు మాట్లాడుతూ ఇటీవలే గణప సముద్రం భూసేకరణ, కొంకాలపల్లి, బొంకలపల్లి, బంద్రాయిపాకుల గ్రామాల పునరావాస కేంద్రాలకు సంబంధించిన పరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్యాకేజీ 27 కింద ఇంకా మిగిలి ఉన్న 68.12 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, అది త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలన్నారు. కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్యాకేజీ 29 కింద డి-5 ను మరింత బలోపేతం చేసి సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుద్ధారం స్టేజ్ 1, 2 కింద డి -5, డి8 కాలువలు వెడల్పు చేయడంతో పాటు మరింత సామర్థ్యం పెంచేందుకు అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్యాకేజ్ - 27 కానయపల్లి వద్ద కాంట్రాక్టర్ పనులు దక్కించుకొని ఇప్పటివరకు పూర్తి చేయలేదని, 60- సి కింద నోటీసులు ఇచ్చి మరో కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. 14.600 కి.మీ ల మేర బుద్ధారం కుడికాలువ విస్తరించి సామర్థ్యం పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా సూచించారు. గట్లఖానాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బుద్ధారం - 2 రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు, గొల్లపల్లి రిజర్వాయర్, ప్యాకేజీ 28 కింద తాడిపర్తి చెరువు అదనపు పనులు, ఘనపూర్ బ్రాంచి కెనాల్ , కర్నె తాండా లిఫ్టు ఇరిగేషన్, రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు, రాజీవ్ భీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ - 2 ఏనుకుంట రిజర్వాయర్ నుండి రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్ వెడల్పు పనుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్యాకేజ్ 19 వద్ద పైపులు పాడైపోయాయని, వాటిని మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పెబ్బేరు చెరువు సామర్థ్యం 5 టి.యం.సి లకు పెంచేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ శాసన సభ్యులు రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇరిగేషన్ ఎస్.ఈ చంద్రశేఖర్, పార్థసారథి, కార్యనిర్వహక ఇంజనీర్లు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# బాల్య వివాహాలను నిర్మలిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు బాల్యవిహం చేస్తే శరీరకంగా సమస్యలు అధికంగా వచ్చే అవకాశం

- బాలవిహాలపై అవగాహన లేకుండా చిన్న వయసులో గర్భం దాల్చడం వాళ్ల తల్లి బిడ్డలకు ప్రమాదకరం



వికారాబాద్, లోకల్ గైడ్ తెలంగాణ :వికారాబాద్ జిల్లా తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య పథకం- మరియు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల పైన అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పురోహితులు,ఖ్వాజిలు పాస్టర్స్ హాజరు కావడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సంక్షేమ అధికారిణి బి. కృష్ణవేణి మాట్లాడుతూ మన జిల్లాలో తెలిసీ తెలియక ఎక్కడో ఒకచోట బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని వాటిని ఆరి కట్టవలసిన బాధ్యత ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరి పైన ఉందని అదేవిధంగా మన వికారాబాద్ జిల్లాకు మారుమూల ప్రాంతాలు, ఎక్కువగా ఉండటం అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు నిరక్షరాస్యులుగా ఉండడంవల్ల పిల్లలకు చిన్నతనంలో పెండ్లిలు చేస్తే కలిగే ఆరోగ్య సమస్యల గురించి మరియు చట్టాల గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు.సాధ్యమైనంత వరకూ మన జిల్లాలో బాల్య వివాహ నిర్మూలనకు కృషి చేస్తున్నామని దానికి వివిధ శాఖల సమన్వయంతో బాలవివాహాలను నిలుపుదల చేస్తున్నామని చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే అమ్మాయికి కలిగే ఆరోగ్య సమస్యల గురించి ప్రతి గ్రామంలో ఏర్పాటుచేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ లో అవగాహన కల్పిస్తున్నామని అదేవిధంగా శాఖ తరపున కళాజాత బృందం వివిధ గ్రామాల్లో తిరిగి బాల్య వివాహాల పైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు . ముందుగా ఒక పెండ్లి చేయాలంటే పెళ్లి ముహూర్తం విషయమై ముందుగా అమ్మాయి తల్లిదండ్రులు పురోహితులను, ఖ్వాజిలను, పాస్టర్లను ఆశ్రయిస్తారు కాబట్టి మీరు అక్కడే అమ్మాయి యొక్క ఏజ్ సర్టిఫికేట్- బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్సి మెమోను ప్రామాణికంగా తీసుకొని సరియైన వయసు లేనట్లయితే అక్కడే మీరు బాల్య వివాహాన్ని నిలుపుదల చేసి.సంబంధిత శాఖ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారుఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వెంకటేష్ మాట్లాడుతూ, మన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లా మనదే కావడం చాలా బాధాకరమని ఇట్టి బాల్యవివాహాల నిర్మూలనకై గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాలని నెలకు లేదా అతి మూడు నెలలకు ఒకసారి అయినా మీటింగ్ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని , బాల్య వివాహాల నిర్మూలనకై ముఖ్యంగా ఆడపిల్లల చదువుతున్న స్కూల్లో వారి యొక్క హాజరు శాతాన్ని పరిశీలించి డ్రాప్స్ అవుట్స్ అధికంగా ఉంటే వారి ఇంటికి వెళ్లి డ్రాప్ అవుట్ కావడానికి గల కారణాలను పరిశీలించి తిరిగి వారు తరగతి గదిలో చేరే విధంగా చూసినట్లయితే బాల్య వివాహాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మనం బాల్య వివాహాన్ని నిర్ధారించడానికి ఆధార్ కార్డు ప్రామాణికం కాదని, బర్త్ సర్టిఫికెట్ కానీ, ఎస్ఎస్సి మెమోను ప్రామాణికంగా తీసుకోవాలని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించుకుని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అర్ధ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మన జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. కొంతమంది తల్లిదండ్రులు బాల్య వివాహాల పైన అవగాహన లేకుండా మా అమ్మాయికి పెళ్లి చేస్తుంటే అధికారులు వచ్చి తీసుకెళ్లారని దానికి మీ సహకారం కావాలని మా దగ్గరికి వస్తుంటారని అలాంటి వారికి మేము ఎప్పుడు సహాయ సహకారాలు అందివ్వనని మీ అమ్మాయికి చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడంఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయో వాళ్లకి వివరించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి మహోత్తరమైన కార్యక్రమానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ కాంతారావు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు బాల్య వివాహం చేస్తే వారికి శారీరక సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాల పైన అవగాహన లేకుండా వల్ల అతి చిన్న వయసులో గర్భం దాల్చడం వలన తల్లి బిడ్డలు ఇద్దరికీ ప్రమాదకరం అని తెలిపారు తీవ్ర పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనతతో మాత శిశువు మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని వారి వివరాలు గొప్యంగా ఉంచి బాల్య వివాహ నిర్ములన కు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి జానయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సంగమేశ్వర్, స్థానిక సి డి పి వో లు వెంకటేశ్వరమ్మ , మెహరున్నీసా, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ ,మిషన్ వాత్సల్యసిబ్బంది ,మహిళా సాధికారత కింది సిబ్బంది, సూపర్వైజర్లు జిల్లాలోని పురోహితులు, ఖ్వాజిలు పాస్టర్స్ మొదలగు వారు హాజరు కావడం జరిగింది.



# ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్

,....జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

లోకల్ గెడ్ ప్రతినిధి మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, సేఫ్టీ, న్యూట్రిషన్, ఎన్వవర్మెంట్, హెల్త్, ఫర్ ఆడోలసెంట్ (స్నేహ) కిశోర బాలికల సంఘాల నాయకుల అవగాహన కార్యక్రమం, నిర్వహించారు,

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై కార్యక్రమానికి వచ్చిన పిల్లలతో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను స్వయంగా వారితో అడిగి తెలుసుకున్నారు, మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు ఏలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా పరిష్కరించుకొని ముందుకు సాగాలని,ఆరోగ్యపరంగా ఉన్నప్పుడే అన్ని విధాల మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటామని అందుకు ప్రక్క ప్రణాళిక ప్రకారం ప్రతిరోజు ఉండాలని సూచించారు, ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ చదువులు ఆరోగ్యం తదితర అంశాల కోసం అనేక నిధులు కేటాయించి పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ ఆ కార్యక్రమాలను పథకాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు, బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 100 బాల్య వివాహాలను నివారించడం జరిగిందని అన్నారు, ఆడపిల్లలు మొబైల్ ఫోన్ సోషల్ మీడియా వాడకం తగ్గించాలని వాటి ద్వారా సమయం వృధా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు, అపరిచిత వ్యక్తులతో కాల్స్ గాని చాటింగ్ గాని చేయొద్దని తెలిపారు, ఫోక్సో చట్టం పై ప్రచారం నిర్వహించాలని తెలిపారు, స్నేహ ద్వారా మీ సమస్యలను పరిష్కరించుకోవాలని అట్టి గ్రూపులో మీరు ఎదుర్కొంటున్న పరిస్థితులను చర్చించుకోవాలని తెలిపారు,పదవ తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ ఫౌండేషన్ కోర్సులలో పూర్తిగా నిబద్ధత ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించాలని తద్వారా తన కుటుంబానికి తల్లిదండ్రులకు అండగా ఉండాలని కోరారు, పూర్తిగా స్థిరపడిన తర్వాతనే వయస్సు వచ్చిన తదుపరి వివాహం చేసుకోవాలని సూచించారు, కొంతమంది పిల్లలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తన జీవితంలో జరిగిన సంఘటనల ద్వారా వివరించి పిల్లలకు తెలిపారు,గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందని, పౌష్టిక మైన, రుచికరమైన ఆహారం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందిస్తున్నాయని వాటిని ఉపయోగించుకొని ఆరోగ్యంగా చదువులోనూ ముందుకు సాగాలని కలెక్టర్ పిల్లలకు సూచించారు, అనంతరం బాల్యవివాహాల నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు,ఆరోగ్య సమస్యలు రాకుండా న్యూట్రిషన్ హెల్త్ ప్రొఫైల్ మైంటైన్ చేయాలని, తమ తల్లిదండ్రులకు అంతర్ పంటలపై పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలని, ప్రతి సమస్యకు పరిష్కారం తప్పకుండా ఉంటుందని ఎవరూ నిరాశ పడవద్దని తెలిపారు,పిల్లలు తెలిపిన సమస్యలు రోడ్ల నిర్మాణము, వసతి గృహాలలో ఏర్పాట్లు, ఆర్టీసీ రవాణా సదుపాయం, తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు,ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, వెల్ఫేర్ అధికారిని సబిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

# మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారుల అద్భుత విజయాలు

## వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధించారు




కుత్బుల్లాపూర్ మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి)వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించి అకాడమీకి గర్వకారణంగా నిలిచారు.ఓపెన్ కేటగిరీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో లక్ష్య సంహిత వెంట్రప్రగడ మరియు ఆమె భాగస్వామి నీరజ్ కుమార్ వేటనాల అద్భుత ఆటతీరుతో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో టాప్-5 ర్యాంక్ హోల్డర్స్ విశ్వాస్ గురుంగ్ -- ప్రియా ప్రకాష్ జంటను 15-12, 15-10 స్కోర్లతో ఓడించారు. అనంతరం సెమీఫైనల్లో రాజేష్ క్రాపా -- వీణ జంటపై 15-05, 15-11 స్కోర్లతో ఘన విజయం సాధించారు.ఫైనల్లో ఆనంద్ -- వెన్నెల జంటపై 15-10, 15-01 స్కోర్లతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. టోర్నమెంట్ మొత్తం వీరి ఆటతీరు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కేవలం 14 సంవత్సరాల వయస్సులోనే లక్ష్య సంహిత సీనియర్ క్రీడాకారులపై చూపించిన ధైర్యవంతమైన ప్రదర్శన అందరి ప్రశంసలు అందుకుంది.అలాగే వెటరన్స్ విభాగంలో కూడా మ్యాచ్ పాయింట్ మహిళా క్రీడాకారిణులు సత్తా చాటారు. 45 ప్లస్ ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో వీణ మాధురి శర్బాధ ప్రత్యర్థి వేముల ప్రసన్నపై 15-09, 15-10 స్కోర్లతో అద్భుత విజయం సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. అంతేకాకుండా 45 ప్లస్ ఉమెన్స్ డబుల్స్ విభాగంలో కూడా మరో గోల్డ్ మెడల్ సాధించి డబుల్ గోల్డ్ విన్నర్‌గా నిలిచారు.50 ప్లస్ ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో శీలా ఇందిరేష్ విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. వీణ మాధురి శర్బాధ మరియు శీలా ఇందిరేష్ ఇద్దరూ తెలంగాణ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు అర్హత సాధించడం విశేషం.ఈ విజయాల సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో వికారాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కొసరాజు లక్ష్మణ్ గారు మరియు గౌరవ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ వేణు ముప్పాల మాట్లాడుతూ, కష్టపడి సాధన చేస్తే విజయం ఎప్పుడూ మన వెంట ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా లక్ష్య సంహిత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే ప్రతిభ కలిగిన క్రీడాకారిణి అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గణితశాస్త్రంలో కస్ప శ్రీలతకు పీహెచ్.డీ. అర్హత

## -నానోద్రవాలపై పరిశోధనకు గీతం విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్



పఠాన్ చేరు, మే 26 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గణిత, గణాంక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని కస్ప శ్రీలత గణితశాస్త్రంలో పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించారు. "నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాల అయస్కాంత-ద్రవగతి ప్రవాహ విశ్లేషణ" అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. డాక్టరల్ పరిశోధనలో భాగంగా శక్తి వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ శీతలీకరణ, పర్యావరణ నమూనాల వంటి ఆధునిక సాంకేతిక అనువర్తనాలలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ అధ్యయనంలో నానోద్రవాలు, హైబ్రిడ్ నానోద్రవాలతో కూడిన సంక్లిష్ట నాన్-లీనియర్ ప్రవాహ వ్యవస్థలను విశ్లేషించేందుకు గాలెర్కిన్ ఫైనైట్ ఎలిమెంట్ పద్ధతితో పాటు మ్యాట్‌ల్యాబ్ ఆధారిత సిమ్యులేషన్లను ఉపయోగించినట్లు వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ఉష్ణ-ద్రవ వ్యవస్థలు, గతిశాస్త్ర పరిశోధనల పురోగతికి గణనీయంగా దోహద పడతాయని పేర్కొన్నారు. కస్ప శ్రీలత పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించిన సందర్భంగా గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్‌తో పాటు పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# గంజాయి నియంత్రణ... శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి..

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో గౌరవంగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు పలువురు పోలీసు అధికారులు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది నుండి సిపి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి,స్టేషన్ రిసెప్షన్‌తో పాటు,పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు,రౌడీషీటర్లు,అనుమానితుల వివరాలు,ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందిని శాఖ పరమైన సమస్యలు ఉటే తనకు నేరుగా తెలియజేయవచ్చునని సూచించారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.పాత కేసులన్నింటినీ పరిశీలించి,ముఖ్యంగా హత్య కేసుల దర్యాప్తును పూర్తి చేసినట్లు వెల్లడించారు.ప్రస్తుతం గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడంతో పాటు,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో గౌరవంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.బాధితుల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే స్పందించాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు విధి సమయంలో తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు.జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు ఆన్ ది స్పాట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.కొన్ని రకాల నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం దాదాపు 80నుంచి 90శాతం కేసుల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ఏదైనా ఘటన జరిగిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని,వెంటనే స్పందించి బాధితులకు సేవలు అందిస్తామని సిపి తెలిపారు.హైవే ప్రాంతాలు,అభివృద్ధి చెందుతున్న బస్తీల పరిధిలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.భూ వివాదాల్లో పోలీసుల జోక్యం లేకుండా చట్టపరమైన విధానంలో వ్యవహరించాలని అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.పోలీస్ స్టేషన్ నిర్వహణ,క్రమశిక్షణ,పరిశుభ్రత,నేర కేసుల దర్యాప్తులో సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని సిపి అభినందించారు.ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్,బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్,తాళ్ల గురిజాల ఎస్ఐ రామకృష్ణ,టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు

## ఎదుర్కొంటున్నప్పటికీ పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం దురదృష్టకరం.




లోకల్ గెడ్ ప్రతినిధి:మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కురవి మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ శ్రేణులు సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యాం సుందర్ శర్మ గారు పాల్గొని మాట్లాడుతూ ధాన్యం కేంద్రాల వద్ద సరైన మౌలిక వసతులు లేకపోవడం, ధాన్యం తూకాల్లో జాప్యం, గన్నీ సంచుల కొరత, రైతులకు సమయానికి టోకెన్లు ఇవ్వకపోవడం,గన్ని సంచులలో నింపిన వడ్లను లోడు ఎత్తడం కోసం లారీలు రాక ఎదురు చూడడం రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తీవ్రమైన ఎండలు వడ గాలుల నేపథ్యంలో ఆరోగ్య రీత్యా రైతులు తమ పంటను రక్షించుకోవడానికి ఆందోళన చెందుతుండగా ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడం బాధాకరం. రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకోవడం లేదు.రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో మాత్రమే రైతు ప్రేమ చూపిస్తూ, క్షేత్ర స్థాయిలో రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. తేమా శాతం 13.5 ℅ వచ్చిన కూడా ఇంకా నిర్లక్ష్యం వహిస్తున్నారుతక్షణమే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీరామోజ్ నాగరాజు కురవి మండల బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి జిన్నె కృష్ణ జిల్లా కార్యదర్శి జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడి రామకృష్ణ సీనియర్ నాయకులు కొనతం పెంటయ్య జిన్నె నరేందర్ నిమ్మశెట్టి సత్యం కొత్త వెంకన్న బీ నారాయణ రమేష్ నాయక్ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.




ఖమ్మం: ( లోకల్ గైడ్ )మే 26.:నేలకొండపల్లి మండలం లో గ్రామదీపికల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో గ్రామదీపికలు నిరవదిక సమ్మె లో భాగంగా మంగళవారం దీక్ష శిభిరం ను సందర్శించారు. సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...గ్రామ దీపికల సమస్యల ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఏ ఒక్క వర్గం కు న్యాయం చేయటం లేదన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించే వరకు వారు చేస్తున్న ఆందోళన లకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని 'వెంటనే వారి డిమాండ్ల ను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూరయ్య, మాదాసు ఆదాం, టీడీపీ నాయకులు గోగినేని వెంకట సీతారాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు పలువురు గ్రామదీపికలు పాల్గొన్నారు.

# జూన్ 3వ తేదీన కోహెడలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, అధికారులు.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): జూన్ 3వ తేదీన కోహెడలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమం ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతీలతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిబట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధి కోహెడ రెవిన్యూ సర్వే నంబర్ 167/1లో కోహెడ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు జూన్ నెల 3న ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 239 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో 167/1లో



సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ 239 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమును నిర్మించడం జరుగుతుందని , తెలంగాణకు మణిహారంలగా కోహెడ మార్కెట్ ఉంటుందని తెలిపారు. జూన్ 3న శంకుస్థాపన కార్యక్రమమును ముఖ్యమంత్రి చేతులమీదుగా చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అందరికీ నాయ్యం చేయడం జరుగుతుందని అన్నారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమమునకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ నుండి పూర్తి సహకారం అందించి విజయవంతం అయ్యేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కడియాల కుంట తండాలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు

## బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి సర్పంచ్ రాజు నాయక్ చౌహాన్



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఫరూక్నగర్ మండలం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కడియాల కుంట తండా అంగన్వాడీ కేంద్రంలో బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాల్యవివాహాలు చేసుకోవడం వలన ఆడపిల్లలకే కాకుండా సమాజానికి కూడా ఎంతో నష్టమని కడియాలకుంట తండా సర్పంచ్ రాజు నాయక్ చౌహాన్ అన్నారు. కడియాల కుంట తండా తోపాటు బూరుగడ్డ తండా లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కడియాలకుంట తండా సర్పంచ్ రాజు నాయక్ చౌహాన్ మరియు అంగన్వాడి టీచర్ సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు నాయక్ చౌహాన్ డిప్యూటీ సర్పంచ్ తావు సింగ్ నాయక్, వార్డు సభ్యులు ప్రియాంక దేవేందర్ గ్రామపంచాయతీ కార్యదర్శి జంగయ్య అంగన్వాడి టీచర్ సుజాత, నిర్మల మరియు ఆశ వర్కర్ సరిత మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత సర్పంచ్ రామలింగం గౌడ్

## కాశిరెడ్డి గూడెం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఫరూక్నగర్ మండలం కాశిరెడ్డిగూడ అంగన్వాడి కేంద్రంలో బాల్యవివాహాల నిర్మూలన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ రజిత హేమలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రామలింగం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... విద్యార్థులను బాల్య వివాహాలపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని ఉన్నత విద్యావైపు పయనించేలా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని సర్పంచ్ అన్నారు బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు మరియు అంగన్వాడీ టీచర్స్ రజిత మరియు హేమలత ఆశ వర్కర్ సుదర్శనమ్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా బాధ్యత

## ప్రతి ఒక సైనికుడిలా పని చేయాలి




హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే26(లోకల్ గైడ్ న్యూస్):రాష్ట్రంలో ఓట్ల తొలగింపుల పరిస్థితి రాకుండా అప్రమత్తంగా ఉండాలి,దీూాలు, దీూాలతో కలిసి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలి,కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై ప్రత్యేక నిఘా అవసరం,కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి,బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సులో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య. హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (దీూా) అవగాహన సదస్సులో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా కడియం కావ్య రూపొందించిన "బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్"ను ఆవిష్కరించి, దీూాలకు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ కావ్య మాట్లాడుతూ.పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకుంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో దీూాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మార్పులను గమనించాలని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి దీూా వద్ద



తాజా ఓటర్ల జాబితా ఉండాలని, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, అనుమానాస్పద ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.దీూాలు, దీూాలతో కలిసి వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని పేర్కొన్నారు. "మన ఓటును మనమే కాపాడుకోవాలని, ప్రతి దీూా ఒక సైనికుడిలా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి" అని ఎంపీ కావ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దీూాలు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎం ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన కళల్ని కాపాడుకుందాం, భవిష్యత్ తరాలకు అందిద్దాం

కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్

కొందుర్గ్ మండల కేంద్రంలో "శ్రీ మల్లికార్జున స్వామి జీవిత చరిత్ర" వీధి నాటక ప్రదర్శన కోసం 25,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్



( లోకల్ గైడ్ షాద్ నగర్)కొందుర్గ్ మండల కేంద్రం శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ఆవరణలో గత వారం రోజులుగా శ్రీ మల్లికార్జున స్వామి వీధి నాటక ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది.నిన్న రాత్రి ముగింపు కార్యక్రమంలో కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ గారు పాల్గొని 25,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అనంతరం రాజేష్ పటేల్ గారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతిక టెక్నాలజీలో వచ్చిన తర్వాత విపరీత మార్పులు గ్రామీణ ప్రాంతాలలో ప్రాచీన కళల్ని హరిస్తున్నాయి. ప్రస్తుతానికి అక్కడక్కడ కొన్ని గ్రామాలలో ఉన్న కళాకారులు ఇంకా వాటిని కొనసాగిస్తున్నారు.పెద్దలు గ్రామాలలో ఇచ్చిన సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో వీధి నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలకు నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు.అనంతరం శ్రీ మల్లికార్జున స్వామి వీధి నాటక బృందాన్ని అభినందించిన కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్.ఈ కార్యక్రమంలో కొందుర్గ్ సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ తనయుడు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు ఆకుల ఇస్తారమ్మ మానయ్య, జగమొల్ల గోపాల్, నాయకులు కావాలి దశరథ్, కుమ్మరి రమేష్ శ్రీశైలం,అంజయ్య, తదితరులు పాల్గొన్నారు..

## జన గణనకు తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలి -రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ):భారత ప్రభుత్వం జన గణన -- 2027 లో భాగంగా ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన మొదటి దశ ఇండ్ల జాబితా, ఇండ్ల గణనకు ప్రజలు గణనకు వచ్చే (ఎన్యుమరేటర్లు) అధికారులకు తమ పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం జన గణన -- 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోందని అన్నారు. అందులో భాగంగా మొదటి దశలో మే 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేపట్టడం జరిగినదని, ఇండ్ల గణన కోసం 11వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మీ ఇంటి వద్దకు నమోదు కోసం వచ్చే అధికారికి మీ పూర్తి సహకారాన్ని అందించాలాన్నారు. అధికారులు అడిగిన అన్ని వివరాలు తెలియజేయాలని సూచించారు. మీరు అందించిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు అధికారులకు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి జిల్లా ప్రజలను కోరారు.

## టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే




బెల్లంపల్లి (లోకల్ గైడ్)హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో మంగళవారం జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు.ఈ సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్,టీబీజీకేఎస్ భవిష్యత్ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు.

## వృద్ధ భక్తుడి పట్ల ఆలయ సిబ్బంది మానవత్వం: వీల్‌చైర్‌పై స్వామివారి దర్శనం



భూపాలపల్లి (లోకల్ గైడ్ ప్రతినిధి)దేవాలయాల్లో వయోవృద్ధులు, దివ్యాంగుల పట్ల ఆలయ సిబ్బంది చూపుతున్న శ్రద్ధ, మానవత్వం స్థానిక భక్తుల ప్రశంసలు అందుకుంటోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలకు ఆలయానికి వచ్చిన, కనీసం నడవలేని స్థితిలో ఉన్న ఒక వృద్ధ భక్తుడికి ఆలయ సిబ్బంది ప్రత్యేక చొరవతో స్వామివారి దర్శనం చేయించారు.ఆ వృద్ధుడి పరిస్థితిని గమనించిన సిబ్బంది తక్షణమే స్పందించి వీల్‌చైర్‌ను ఏర్పాటు చేశారు. కేవలం వీల్‌చైర్ ఇవ్వడమే కాకుండా, ఆలయ మెట్లపై నుండి అతనిని అత్యంత జాగ్రత్తగా పైకి ఎక్కించారు. కుటుంబ సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది కూడా భుజం కలిపి, సదరు వృద్ధ భక్తుడిని సురక్షితంగా గర్భాలయం వరకు తీసుకెళ్లి స్వామివారిని దర్శించుకునేలా చేశారు.ఆలయాల్లో వయోవృద్ధులు, దివ్యాంగులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా దైవ దర్శనం చేసుకునేందుకు వీలుగా వీల్‌చైర్ సౌకర్యాన్ని, అలాగే సహాయం చేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సిబ్బంది అందించిన ఈ సేవలను భక్తులు ముక్తకంఠంతో అభినందిస్తున్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి.. జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి కేటాయించబడిన రైస్ మిల్లులు,గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వి రాములు సూచించారు.మంగళవారం జైపూర్ మండలం రామారావుపేటలోని వరలక్ష్మి,సుముఖ గోదాములను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేపట్టి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు,గోదాములకు తరలించినట్లు తెలిపారు.రైస్ మిల్లులు,గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతిని వేగవంతంగా చేపట్టాలని,రోజుకి కనీసం 40నుండి 50లారీల వరకు ధాన్యం దిగుమతి చేయాలని తెలిపారు.ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను సమకూర్చినట్లు తెలిపారు.ధాన్యం దిగుమతి త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం భీమారం తహసిల్దార్ తో కలిసి మండలంలోని అర్కపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ప్రభుత్వం రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు,నీడ ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు.రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రంలో ఏర్పడిన హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించారు.ఈ నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని,ఎలాంటి తాలు,తప్ప లేని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

# రైతుగోస - బీజేపీ భరోసా' బస్ యాత్ర లో బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,మే26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న 'రైతుగోస – బీజేపీ భరోసా' యాత్రనీరుకుళ్ళ గ్రామంలో ధాన్యపు కళ్ళాలను సందర్శించిన బీజేపీ అగ్రనేతలురైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు: ఎంపీ ఈటల రాజేందర్‌డిక్లరేషన్ పేరిట వరంగల్ రైతుల్ని కాంగ్రెస్ మోసం చేసింది: బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగితే ఐదేళ్లు కూడా అధికారంలో ఉండలేరు: ఎంపీ రఘునందన్‌రావు,హనుమకొండ జిల్లాలో 'రైతుగోస – బీజేపీ



భరోసా' బస్ యాత్ర ఉధృతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ ముఖ్య నేతల బృందం సందర్శించింది. కేంద్రంలో ధాన్యం రాశుల వద్ద ఇబ్బందులు పడుతున్న రైతులతో నేతలు స్వయంగా మాట్లాడి, కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులను, ప్రతిపక్షాలను ధబాయించడం సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే బంద్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. కనీసం గన్నీ బ్యాగులు (సంచులు), కాంటాలు, లారీలు ఏర్పాటు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనలేని మంత్రులు సిగ్గులేకుండా ఎదురుదాడికి దిగడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోళ్లకు, సంచులకు, పరదాలకు, రవాణాకు వంద శాతం నిధులు ఇస్తుంటే.. కొనుగోలు చేయడం చేతకాక కేంద్రంపై నెపం నెట్టడం రేవంత్ రెడ్డి చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ధాన్యం సేకరించకపోతే రైతులు ఈ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.బీజేపీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని, క్షేత్రస్థాయికి వచ్చి చూస్తే 50 శాతానికి పైగా ధాన్యం ఇంకా కళ్ళల్లోనే మూలుగుతోందని అన్నారు. వరంగల్ వేదికగా 'రైతు డిక్లరేషన్' ప్రకటించిన కాంగ్రెస్, నేడు ఇక్కడి రైతులనే నట్టేట ముంచిందని ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం దుర్మార్గుల పాలనకు అద్దం పడుతోందన్నారు. "మేము బీజేపీ ఎమ్మెల్యేలుగా అడుగుతున్నాం.. మమ్మల్ని సస్పెండ్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా?" అని సవాల్ విసిరారు. రైతులకు అన్యాయం జరిగితే బీజేపీ చూస్తూ ఊరుకోదని, అవసరమైతే పెద్ద ఎత్తున రైతు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు మాట్లాడుతూ.. పెట్రోల్ ధరల పెరుగుదలపై మాట్లాడిన పాపానికి ఒక ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాన్ని పీకేయడం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్ తుగ్లక్ పాలనను రాహుల్ గాంధీ చూడాలని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ రైతులకు బేడీలు వేస్తే, నేడు రేవంత్ రెడ్డి ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. మాట్లాడిన వారిపై ఇలాంటి అప్రజాస్వామిక, కక్షసాధింపు చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కూడా అధికారంలో ఉండలేదని స్పష్టం చేశారు.

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ 'రైతుగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావులతో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి, ఎమ్మెల్సీ జు. ఆంజి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మారెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్,మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కే. రాజయ్య యాదవ్, చందుపట్ల కీర్తి రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, సిద్ధం నరేష్ పటేల్, ఎడ్ల అశోక్ రెడ్డి, బద్దం మహిపాల్ రెడ్డి, పోతుగంటి భరత్ ప్రసాద్, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆరుట్ల దశమంత రెడ్డి, మల్లాది తిరుపతి రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షులు మొగిలి, జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ తదితర హనుమకొండ జిల్లా బీజేపీ నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఖమ్మం...



లోకల్ గైడ్ ' ఖమ్మంవరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందుతులు అరెస్టువరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.మంగళవారం టేకులపల్లి వంతెన వద్ద ఎస్సై వి. రమేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా గత కొంతకాలం నుండి ఖమ్మంలో రెండు మోటార్ సైకిల్, రెండు ఆటోలు దొంగిలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా 3,30,000 ఉంటుందని తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ లో సిపిఐ ఆఫీస్ వద్ద ఒక మోటార్ సైకిల్ ను రెండవది ఖమ్మం బాలాజీ నగర్ లో లిటిల్ స్టార్ హాస్పిటల్ వద్ద ఒక ఆటోను, మూడోది ఖమ్మం బ్రాహ్మణ బజార్లో ఒక ఇంటి ముందు ఉన్న పల్సర్ మోటార్ సైకిల్ ను, మరియు ఖమ్మం నెహ్రూ నగర్ లో వీచీ= హాస్పిటల్ ముందు ఆగి ఉన్న ఒక ఆటోను దొంగిలించినావని నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు.నిందితులు ఖమ్మం పెద్ద తండాకు చెందిన ఆటో డ్రైవర్లైన నునావత్ సాయికుమార్, బానోత్ సాయికుమార్, వియం బంజరకు చెందిన రేపల్లి శ్రీను ఏరాజు ఇతని పై గతంలో కూడా ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో రెండు దొంగతనాలు చేశాడని తెలిసిందన్నారు. రెండు ఆటోలు, రెండు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకొని వారిని అరెస్టు చేసి కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు.

## చలో ఢిల్లీ కార్యక్రమం వనవాసుల్లో నూతన చైతన్యం

జనజాతి సాంస్కృతిక సమాగమం విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు



చర్ల : లోకల్ గైడ్ :జనజాతి సాంస్కృతిక సమాగమం కొరకు నిర్వహించిన "చలో ఢిల్లీ" కార్యక్రమానికి గ్రామ గ్రామం నుండి విచ్చేసిన వనవాసి బంధువులందరికీ హృదయపూర్వక నమస్కారములు. స్వతంత్ర భారతదేశం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తవుతున్న ఈ చారిత్రక సమయంలో ఇంతటి గొప్ప కార్యక్రమం నిర్వహించబడటం, అందులో మనమంతా భాగస్వాములు కావడం నిజంగా మన అదృష్టంగా భావిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్తలు చేసిన ప్రసంగాలు, కేంద్ర గృహ మంత్రి మాన్యశ్రీ అమిత్ షా గారు ఇచ్చిన హామీలు దేశంలోని వనవాసుల జీవన వికాసానికి దోహదపడతాయని ఆశిద్దాం. ఈ కార్యక్రమంలో చర్చించిన



అంశాలను మన గ్రామాలలో విస్తృతంగా చర్చించి, వనవాసి సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన గొప్ప బాధ్యత మన అందరిపై ఉంది. ఈ కార్యక్రమంలో ఎంతోమంది కొత్త కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాంటి వారిని మన కార్యాచరణలో భాగస్వాములను చేయాలి. అలాగే పాత కార్యకర్తల మార్గదర్శకత్వం తీసుకుంటూ ముందుకు సాగాలి. మంచి లక్ష్య సాధన కోసం కొంత త్యాగం అవసరమనే విషయాన్ని మనమందరం గుర్తుంచుకోవాలి. ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, హితైషులకు, ప్రాంత మరియు జిల్లా పదాధికారులకు, క్షేత్ర మరియు ఆ.బా.వ.క. ఆశ్రమం అధికారులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాము.

## హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ అంత్యక్రియలు నిమిత్తం 30వేల సహాయం.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బంబారా గ్రామానికి చెందిన జాడి బాపూరావు రెబ్బెన పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధుల నిర్వహిస్తున్నాడు.1993 బ్యాచ్ కు చెందిన ఆయన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు.మృతుడి స్వగ్రామమైన బాంబారాలో ఆయన భౌతిక కాయానికి జిల్లా ఎస్పి నితికా పంత్ పూలమాలవేసి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు భావోద్వేగానికి లోనయ్యారు.అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహయం కింద 30వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందించి,పోలీస్ శాఖ అండగా ఉంటుందని,ధైర్యంగా ఉండాలని భరోసనిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి చిత్తరంజన్,ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్,జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి,సిఐలు వేణుగోపాల్,శ్రీనివాస్,వామన మూర్తి,సంజయ్,ఎస్ఐలు వెంకటకృష్ణ,మహేందర్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తాం --కాంగ్రెస్ నేతల తీరు పై బీఆర్ఎస్ నేతల ఫైర్




పెద్దపల్లి , మే 25:(లోకల్ గైడ్ )ప్రతిపక్ష పార్టీగా, ప్రజల తరుపున ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తామని పెద్దపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతల పై ఫైర్ అయ్యారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మారు మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో అన్నదాతలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిపక్షపార్టీ హోదాలో మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులకు, ప్రస్తుతం ఓపెనింగ్‌లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అంతా చూస్తున్నారు. గమనిస్తున్నారని, ఇప్పటికైనా తప్పుడు కూతలు బంద్ చేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ప్రెస్‌మీట్ పెట్టవద్దు, మాట్లడవద్దు అంటున్నారు. కానీ ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తాం, ప్రశ్నిస్తాం, కొట్లాడుతాం. కాంగ్రెస్ నాయకుడు మస్రత్ నోటికి ఎంత వస్తే అంతా మాట్లాడుతూన్నాడు.. ముందు నీ పార్టీలో నీ స్థాయి ఏంటో తెలుసుకో, మాట్లాడితే పదవులు వస్తాయనే ఆశతో కొందరు ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు మాట్లాడుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాళ్లు మొక్కిన వాళ్లు నేడు పదవుల కోసం, తమ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రెండున్నర ఏళ్లల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏం లేదు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పెద్దపల్లిలో గెలిచేది దాసరి మనోహర్‌రెడ్డియే అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశిపాక వాసు, ఎండీ ముఖిం, బొడ్డుపల్లి రమేష్, ఫహిం, పల్లె మధు, ఎండీ రఫీ, కుక్క మనోజ్, ఆదిల్ ఖాన్, ఎండీ అతీక్, ఎండీ ముజాషిర్, అజర్, జూబేరీ, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

# జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ఈ నెల చివరి నాటికి కొనుగోళ్లు పూర్తి కావాలి

లారీల కొరత ఉంటే ట్రాక్టర్ల ద్వారా తరలింపు.. రైతులకు రవాణా ఛార్జీల చెల్లింపు

అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి




భూపాలపల్లి (లోకల్ గైడ్ ప్రతినిధి)జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎక్కడా జాప్యం లేకుండా, అత్యంత వేగంగా జరిగేలా చూడాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు.మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో పంటల కోతలు కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యాయని, అందువల్ల ఈ నెల చివరి నాటికి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తిగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి. రైతులు ఎవరైనా స్వచ్ఛందంగా తమ ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే, వారికి ప్రభుత్వం తరఫున ట్రాక్టర్ ఛార్జీలు చెల్లిస్తాం. ధాన్య నిల్వలకు గోదాముల కొరత రాకుండా ఉండేందుకు వీలుగా పత్తి మిల్లులను సైతం సిద్ధం చేయడం జరిగింది. ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో త్వరితగతిన నమోదు ట్యాబు ఎంట్రీ చేసి, వెంటనే మిల్లులకు, గోదాములకు తరలించాలి. తహసీల్దార్లు ప్రతి రైస్ మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బందిని నియమించి కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి, గన్ని సంచులలో నింపి, వాటిపై టార్పాలిన్లను కప్పి ఉంచాలి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గన్ని సంచులు, టార్పాలిన్ల కొరత ఎక్కడైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలి.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీఆర్డీఓ బాలకృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ఎమర్జెన్సీ విభాగం అత్యంత కీలకం...
## -- గోల్డెన్ అవర్‌లో చికిత్సతోనే ప్రాణాలకు రక్షణ

- వరల్డ్ ఎమర్జెన్సీ డే సందర్భంగా మెడికవర్ వైద్యులు




పెద్దపల్లి , మే 25:(లోకల్ గైడ్ )ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులు ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారో, అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ విభాగం కూడా అంతే కీలకమని మెడికవర్ వైద్యులు పేర్కొన్నారు. ప్రమాదాలు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, శ్వాసకోశ సమస్యలు, విషప్రయోగం వంటి అనూహ్య పరిస్థితుల్లో మొదటి గంటలో అందించే వైద్య సేవలు రోగి ప్రాణాలను కాపాడటంలో నిర్ణయాత్మకంగా ఉంటాయని వెల్లడించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రికి ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజుతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ విభాగం ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక వైద్య వ్యవస్థలో ఎమర్జెన్సీ విభాగం ఒక కీలకమైన భాగమని, అనేక సందర్భాల్లో రోగి ప్రాణాలు అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది చాకచక్యంపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటలో సరైన వైద్యం అందితే రోగి ప్రాణాలు నిలబెట్టే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే రోగి చుట్టూ గుమికూడడం, అజాగ్రత్తగా కదిలించడం, అవసరం లేకుండా నీళ్లు లేదా ఆహారం ఇవ్వడం వంటి చర్యలు మరింత ప్రమాదాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి, రోడ్డు ప్రమాదాల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి ఆసుపత్రిలో సమర్థవంతమైన ఎమర్జెన్సీ విభాగం ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అత్యవసర వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## విఓఎ ల సమస్యలు పరిష్కారించాలి...



బెల్లంపల్లి (లోకల్ గైడ్)గత 8రోజులుగా విఓఏ లు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి అన్నారు.గ్రామీణ ప్రాంతం అభివృద్ధికి,మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేసినా వారికీ సరైన వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ప్రస్తుతం వారికీ 6వేల వేతనం 5నెలలకు ఒకసారి ఇస్తున్నారని,ప్రతి పనికి వీఓఏ లను గొడ్డు చాకిరీ చెపించుకున్నారని వాపోయారు.ప్రధానంగా కనీస వేతనం 26వేలు చెల్లిస్తు,వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని,అదేవిధంగా హెచ్ఆర్ పాలసి వర్తింప జేసీ,సాధారణ భీమా 20లక్షలు అందించి,58 జీఓ ను సవరించి ఆన్లైన్ పనులకు ట్యాప్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి విఓఏ ల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీఆర్పి నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో హోమాలు...
## పడిపూజ అభిషేకం పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మే 26 (లోకల్ గైడ్ తెలంగాణ )సుల్తానాబాద్ మండలంలోని శాస్త్రి నగర్ లో ఉత్తర నక్షత్రంఅయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని మంగళవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్ లో గల అయ్యప్ప స్వామి దేవాలయం లో వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా జరిపారు, ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకం, పడిపూజ, హోమాలు పూజారులు గూడ రమేష్ శర్మ, సాయినాథ్ శర్మలు ఘనంగా నిర్వహించారు, ఆలయ నిర్వాహకులు మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ సాయిరీ పద్మ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు , పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలుస్వీకరించారు.ఈ కార్యక్రమం లో మిట్టపెల్లి మురళి గురుస్వామి,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రవీందర్, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధి కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), డీలర్ మెరుగు వెంకటేష్ , పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, తుమ్మ రాములు, గుండ మురళి, ఉస్తేశీ రవి గురుస్వామి పలువురు పాల్గొన్నారు.

# ఆదాని, అంబాన్ని రాబంధుల రాజ్యం మా కొద్దు..

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...

వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో. ఇంధనపు ధరలకు నిరసనగా ఎద్దుల బండ్ల ర్యాలీ ..




వనపర్తి లోకల్ గైడ్ మే 26 :(అంబటి స్వామి ప్రతినిధి )ఆదాని,అంబానీ లాంటి రాబందులను ప్రోత్సహిస్తూ నిరుపేదలను నిలువు ముంచుతున్న బిజెపి పాలన మా కొద్ద ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మండి పడ్డారు. మంగళ వారం వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర కాంగ్రేస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వనపర్తి పట్టణ కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో ఎద్దుల బండ్ల ర్యాలీ చేశారు. పట్టణంలోని రామాలయం నుంచి రాజీవ్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ఎద్దుల బండ్ల ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు శివసేనారెడ్డిలు ఎద్దుల బండ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్ర బిజెపి సర్కార్ మొదటి భోగిలో మోదీ, రెండో భోగిలో ఆదాని, అంబానీ లాంటి వారు ప్రయాణిస్తూ దేశాన్ని రాబందుల పిక్కుతింటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డబల్ ఇంజన్ సర్కారుకు చరమగీతం



పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు . కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఇంధనంపై పెంచిన రేట్లు వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. గంటలు మోగిస్తే చప్పట్లు కొట్టినంత మాత్రాన నిరుపేదల సమస్యలు తీరవని, ప్రజలకు అధిక భారం లేకుండా చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అధిక ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని ఆయన విమర్శించారు.భారతీయ జనతా పార్టీ నాయకులు వనపర్తి లో ధర్నాలు చేయడం సరికాదని, బాధ్యత యుతంగా వ్యవహరించి మోడీ ఇంటి ముందల ధర్నాలు చేసి రాష్ట్రానికి ఏదైనా మేలు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు . మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఇప్పటికే మూడు పర్యాయాలు ఏడున్నర రూపాయలను పెట్రోల్, డీజిల్ పై పెంచిందన్నారు . మోడీ సర్కార్ ఇంధనం ధరలను వెంటనే తగ్గించకపోతే జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి బీజేపీ మెడలు వంచాల్సి వస్తుందన్నారు. టిఆర్ఎస్, బిజెపి పార్టీలు మంచి దోస్తాన్ మైంటైన్ చేస్తున్నాయని వారి కార్యకలాపాలు నిరసిస్తూ మనం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కాంగ్రేస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలోని 19 రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వమే ఉందని, కానీ, దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదంటూ ఆయన నిలదీశారు. వడ్ల కొనుగోలు నీతులు చెప్పే నాయకులు వడ్ల కష్టాలు పెంచడానికి మీరు పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు వాస్తవం కాదాని ఆయన ప్రశ్నించారు. ఎఫ్ సి ఐ లకు, గోదాములకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోగా పైపెచ్చు ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదన్నారు.వారి నిరంకుశ పాలనను నిరసిస్తూ అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి నరేంద్ర మోడీ సర్కార్ ను ముట్టడించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.తెలంగాణలో రేవంత్ రెడ్డి అనే ఇంజన్ ప్రభుత్వాన్ని కొనసాగిస్తుందని, రానున్న రోజుల్లో కేంద్రంలోనూ రాహుల్ గాంధీ మరో ఇంజన్ గా మారతారని, ప్రతి ఒక్కరు కాంగ్రేస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ ధర్నా కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రేస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లలో పారదర్శకత ఉండాల.

- తూకాల్లో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచన.
- గోదాం సౌకర్యం లేక మక్కల నిల్వలో ఇబ్బందులు.
- గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి.

ఏఎంసి డైరెక్టర్ పోచారం యాదగిరి.



లోకల్ గైడ్/బంట్వారం:మండల కేంద్రంలోని ూూజూ మక్కల కొనుగోలు కేంద్రాన్ని మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచారం యాదగిరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మక్కల సేకరణ విధానం, తూకాల ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు నమ్మకాన్ని కలిగించే విధంగా పనిచేయాలని ఆయన అన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తూకాల్లో మోసాలకు తావులేకుండా ఖచ్చితమైన తూకాలు వేయాలని, రైతులకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని ూూజూ సిబ్బందికి ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి పంట తీసుకొచ్చే రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, అందువల్ల తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే గోదాం సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా గోదాం లేకపోవడంతో మక్కలను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయాల్సి వస్తోందని, వర్షాలు లేదా ఇతర కారణాల వల్ల ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను సంబంధిత ఉన్నతాధికారులు, స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి గోదాం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరనున్నట్లు తెలిపారు. రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పోచారం యాదగిరి పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పంట అవశేషాలను కాల్చవద్దు..
## జిల్లా వ్యవసాయ శాఖ అధికారి. శ్రీనివాస్

పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



పెద్దపల్లి, మే- 26:(లోకల్ గైడ్ )పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో వరి పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చినపుడు కార్బన్ మోనాక్సైడ్ (జూ), కార్బన్ డయాక్సైడ్ (జూ2), నైట్రోజన్ డయాక్సైడ్, (చీూ2), సల్ఫర్ డయాక్సైడ్ (ూూ2) వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.అలాగే, పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని , దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు.జిల్లాలో పంట అవశేషాల దహనాన్ని నిరోధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి స్పష్టం చేశారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, శాశ్వత వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సర్ స్పెషల్ ఇంటెన్సీ రివిజన్
## ప్రత్యేక సవరణ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి.

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 26. ( లోకల్ గైడ్ ). బిజెపి నల్గొండ మండల బిఎల్ఎ-2 ల సమావేశం బిజెపి మండల అధ్యక్షులు బోగరి అనిల్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ఇంచార్జ్ బొమ్మరబోయిన రాజు ముదిరాజు పాల్గొని మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రత్యేక సవరణ ప్రక్రియ దీని ద్వారా చనిపోయిన లేదా మరొక ప్రాంతానికి బదిలీ అయిన ఓటర్ల పేర్లు తప్పుడు విధానంతో జాబితాలో చేరిన పేర్లు నకిలీ ఓటర్లు లేదా ఎక్కువ ప్రాంతాల్లో ఓటు ఉన్న వారి వివరాలను జాబితా నుండి తొలగించి అర్హులైన ఓటర్ల పేర్లను చేర్చేలా ఎన్నికల సంఘం చేపడుతున్నటువంటి ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తరపున బిఎల్ఎ. టు లు పూర్తిగా సహకరించి పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయడానికి బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు , ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, బిజెపి రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య , బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ కొత్తపల్లి వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి సురికంటి వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు కొత్తపల్లి ప్రమోద్, చామకూరు మహేష్, నల్ల నరసింహ మండల ఉపాధ్యక్షులు రేగట్టే రుక్మా గౌడ్, చింతపల్లి వెంకన్న, మండల కార్యదర్శి పగిళ్ల వెంకన్న, శక్తి కేంద్ర ఇన్చార్జి లు, నందిపాటి శ్రీకాంత్,పనస సురేష్ , యాస నర్సిరెడ్డి, కందుకూరి సుధాకర్, పోతేపాక కిరణ్, ఎ సాదక్, నారబోయిన మల్లేష్, బూతు అధ్యక్షులు దారం రాజేష్, ఆలకుంట్ల సునీల్, ఉప్పునూతల శ్రీహరి, ఆలకుంట్ల మహేష్, భీమనబోయిన జానయ్య, బడుపుల నగేష్, మోదుగుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసిపి కే రామకృష్ణ.

ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాల పార్కింగ్ అతి ప్రమాదకరం.



రాజేంద్రనగర్, (లోకల్ గైడ్ ): ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసిపి కె రామకృష్ణ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు సూచించే కరపత్రాలను రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రాజు ఇతర ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి కే. రామకృష్ణ మాట్లాడుతూ రహదారి వినియోగదారులు రహదారి భద్రతకు సంబంధించిన సూచనలను తప్పక పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండవన్నారు.

### ప్రజలకు తెలియజేసిన ముఖ్య సూచనలు ఇవి:

ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడం ప్రమాదకరం. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఏ వాహనం ఈ మార్గంలో వెళ్లాలో సైన్ బోర్డులలో రోడ్డుపై సూచించడం జరిగిందన్నారు. ఆ లేన్ క్రమశిక్షణను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏ వాహనదారుడు



కూడా అపసవ్య దిశలో వాహనాన్ని నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఐ ఆర్ బి అధికారులు, ఔటర్ రింగ్ రోడ్ అధికారులు పాల్గొన్నారు.

